PRGI REGD No.: TGTEL/26/A4986

# ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 021 | బుధవారం | 15-07-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 021 | Wednesday | 15-07-2026 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri





## కాపు ఉద్యమంలో చెరగని 'ముద్ర'

- సుదీర్ఘ పోరాటంలో అలసి శాశ్వత నిద్ర
- కాపు గర్జనకు దిక్సూచి... ఉద్యమ జ్వాలకు చిరునామా

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో కొందరు నాయకులు అధికారంతో గుర్తింపు పొందుతారు. మరికొందరు ఎన్నికల విజయాలతో తమ ముద్ర వేస్తారు. కానీ చాలా అరుదుగా కొందరు మాత్రమే ఒక సామాజిక ఉద్యమానికే ప్రతీకలుగా నిలుస్తారు. పదవులు, పార్టీలు, ఎన్నికల విజయాలు, పరాజయాలన్నింటినీ దాటి ఒక వర్గం ఆకాంక్షలకు, ఆవేదనకు, ఆత్మగౌరవానికి ప్రతినిధులుగా మారిపోతారు. అలాంటి అరుదైన నాయకుల్లో ముద్రగడ పద్మనాభం ఒకరు. వంగవీటి మోహనరంగా తర్వాత కాపు సామాజిక వర్గానికి ఉద్యమ స్వరంగా వినిపించిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ముద్రగడ పద్మనాభమే. ఆయన రాజకీయ జీవితం ఎన్నో మలుపులు తిరిగినా, ప్రజల జ్ఞాపకాల్లో మాత్రం "కాపు ఉద్యమ నాయకుడు"గానే నిలిచిపోయారు. అందుకే ఆయన మరణం ఒక మాజీ మంత్రి మరణం మాత్రమే కాదు... నాలుగు దశాబ్దాలకుపైగా సాగిన ఒక ఉద్యమ రాజకీయానికి తెరపడిన క్షణం.

2లో..



## సాయికృష్ణ కేసులో కీలక మలుపు

- సీబీఐ విచారణపై వెనక్కి తగ్గిన తల్లి
- పిటిషన్ ఉపసంహరించుకున్న విజయలక్ష్మి

అక్రమ నిర్బంధం, చిత్రహింసలు, కస్టడీ మరణం ఆరోపణలతో వెలుగులోకి వచ్చిన గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి హైకోర్టులో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం కొత్త పిటిషన్ దాఖలు చేశారు. ఈ నిర్ణయం కేసు విచారణలో కొత్త చర్చకు దారితీసింది. (వివరాలు 2లో..)

## నేపాల్‌లో జెన్‌జీ వెక్స్

- ప్రధానిని గద్దె దింపేందుకు ఫిక్స్
- 100 రోజుల్లోనే అభాసుపాలు
- ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

నేపాల్ ప్రధానమంత్రి బలేంద్ర షా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయ్యాయి. సంస్కరణలు, పారదర్శక పాలన, జవాబుదారీతనం పేరుతో అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం ఇప్పుడు తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. వరుసగా జరిగిన రెండు ఘటనలు ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తిని మరింత పెంచాయి. గత ప్రభుత్వాన్ని కూల్చిన ప్రశ్నలే ఇప్పుడు కొత్త ప్రభుత్వాన్నీ వెంటాడుతున్నాయి. (వివరాలు 2లో..)

# క్షేత్రస్థాయిలోకి వెళ్లండి..




- » మానవీయకోణంలో ఆలోచించండి
- » ప్రజల సమస్యలు పరిష్కరించండి
- » అధికారులకు సీఎం చంద్రబాబు సూచన

ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీ, ఫిర్యాదును మానవీయ కోణంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులన్నింటికీ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర, వ్యక్తిగత, సామాజిక సమస్యలపై ఆలస్యం లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రొటీన్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుందని చెప్పారు. (వివరాలు 7లో..)

**• ఉద్యోగుల తప్పిదమే ప్రభుత్వానికి నష్టం**

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు చేసే పొరపాట్లు ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించి సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. అన్ని బస్టాండ్లలో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. బస్సులు నిర్ణీత సమయానికి నడిచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రతి శాఖ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## పాలనలో వేగం పెంచండి

- టెక్నాలజీని అందిపుచ్చుకోండి
- బిజినెస్ రూల్స్‌కు భారీ మార్పులు
- నిబంధనల సంస్కరణలకు సీఎం శ్రీకారం

ప్రభుత్వ పాలన మరింత వేగంగా సాగాలంటే పాత బిజినెస్ రూల్స్‌లో సమూల మార్పులు అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. టెక్నాలజీ వినియోగంతో అవసరం లేని నిబంధనలను తొలగించి, కొత్త అవసరాలకు అనుగుణంగా రీడ్రాఫ్ట్ చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా నిర్ణయాలు వేగంగా అమలు కావాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేలా పాలనా వ్యవస్థలో వెసులుబాటు ఉండాలని పేర్కొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణ గడువు పెంపు

**పది రోజుల పాటు ఏపీకి ఈసీ ఊరట**

**అక్టోబర్ 3 వరకు ఓటర్ల పరిశీలన**

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎన్నికల సంఘం గడువు పెంచింది. ఈ రెండు రాష్ట్రాలు మే 14న ప్రారంభమైన మూడో దశ ఎస్ఐఆర్‌లో భాగంగా ఉన్నాయి. మొత్తం 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఓటర్ల వివరాలను మరింత ఖచ్చితంగా నమోదు చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. (వివరాలు 2లో..)



## దురాశతో దుఃఖం.. కడతేరిన కుటుంబం

- ఆస్తి కోసం ఆరు ప్రాణాలు బలి
- మిగిలింది కన్నీరు.. జీవితాలు శూన్యం



దురాశ... నాలుగు ప్రాణాలను మింగేసింది! ఆస్తి కోసం మొదలైన కుట్ర... రైలు పట్టాలపై కుటుంబం ముగిసింది. ఒక హత్య... నాలుగు ఆత్మహత్యలు... చివరికి మిగిలింది కన్నీరు, శూన్యం మాత్రమే.. జీవితంలో సంపాదించేది ఆస్తి కావచ్చు... కానీ కోల్పోయేది మనుషులైతే ఆ సంపాదనకు విలువ ఏముంటుంది? ఒక్క క్షణం దురాశ మనసులో చోటు చేసుకుంటే... అది బంధాలను, మనసులను, చివరికి ప్రాణాలనే బలి తీసుకుంటుందని మరోసారి గుర్తు చేసిన విషాద గాథ ఇది. (వివరాలు 7లో..)




## వైజాగ్‌లో జగన్ వైలెంట్

- » మత్స్యకారులపై చూపాలి మమకారం
- » ప్రభుత్వం చెల్లించాలి కోటి పరిహారం
- » బాధితులకు పరామర్శ.. బాబు సర్కార్‌పై విమర్శ

విశాఖపట్నం తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. వన్‌టౌన్ ప్రాంతంలో బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి చిన్నాను కలిసి జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఆవేదనను విని వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ఆ దేశాలకు ఇండియా షాక్ కారణం తెలిస్తే మైండ్ బ్లాంక్



బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పూర్తిగా లేదా కొంత భాగమైనా బలవంతపు శ్రమతో తయారైన ఉత్పత్తులను దేశంలోకి అనుమతించబోమని వాణిజ్య శాఖ అధికారికంగా ప్రకటించింది. అంతర్జాతీయ వాణిజ్య ప్రమాణాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.అమెరికా ఇలాంటి ఉత్పత్తుల దిగుమతులపై పలు దేశాలపై విచారణ చేపట్టిన నేపథ్యంలో భారత్ ముందుగానే ఈ చర్య తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చల సమయంలో ఈ నిర్ణయం దేశానికి సానుకూల సంకేతంగా మారే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచనం ప్రకారం శిక్ష భయంతో చేయించే పనిని బలవంతపు శ్రమగా పరిగణిస్తారు. అనుమానాస్పద ఉత్పత్తులపై విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్ దర్యాప్తు చేపట్టనున్నారు. దీంతో ప్రపంచ వాణిజ్యంలో నైతిక ప్రమాణాలను పాటించే దేశంగా భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగు వేసినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## చమురు షాక్ మార్కెట్ పతనం

**₹ 3 లక్షల కోట్ల సంపద ఆవిరి**

**అమ్మకాలతో కుప్పకూలిన సూచీలు**

దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. సెన్సెక్స్ 561 పాయింట్లు పడిపోయి 77,055 వద్ద ముగిసింది. నిఫ్టీ 159 పాయింట్లు కోల్పోయి 24,052 వద్ద నిలిచింది. ఆటో, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ షేర్లలో భారీ అమ్మకాలు జరిగాయి. ఈ పతనంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గిపోయింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిన అనేక పరిణామాలు ఒకేసారి ప్రభావం చూపాయి. (2లో..)



## ఎన్నాళ్లకెన్నాళ్లకు, 19 ఏళ్ల తర్వాత

**మళ్లీ కోల్‌కతాకు తస్లీమా నస్రీన్ రాక**

బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ దాదాపు 19 ఏళ్ల తర్వాత కోల్‌కతా నగరానికి రానున్నారు. ఆగస్టు 1న రవీంద్ర సదన్‌లో జరిగే మతోన్మాద వ్యతిరేక సాహిత్య సభలో ఆమె పాల్గొననున్నారు. ఈ విషయాన్ని తస్లీమా నస్రీన్ స్వయంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. కార్యక్రమంలో కవితలు చదివే అవకాశం కూడా ఉంది. ఈ పర్యటనకు సాహిత్యపరంగానే కాకుండా రాజకీయ ప్రాధాన్యమూ ఏర్పడింది. (వివరాలు 7లో..)



## కొత్త అవతారమెత్తిన స్ట్రాటజిస్ట్

**బీహార్ ఉప ఎన్నికలో పీకే కంటెస్ట్**

**అంచనాలకందని ప్రాపర్టీ • గెలుపుపై లేదు షూరిటీ**


శకునాలు చెప్పి రాజకీయాలను మలిచిన వ్యూహకర్తగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్.. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల బరిలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బ్యాంకీపూర్ ఉప ఎన్నికలో నామినేషన్ దాఖలు చేసిన ఆయన అఫిడవిట్‌లో రూ.208 కోట్ల ఆస్తులను ప్రకటించడంతో బిహార్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది. బిహార్‌లోని బ్యాంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారింది. జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. (2లో..)



## వస్తే.. జైలుకే..

**• హసీనాకు బంగ్లా సర్కార్ వార్నింగ్**

మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తే వెంటనే జైలుకు పంపిస్తామని ఆ దేశ ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హసీనా స్వచ్ఛందంగా లొంగిపోయినా చట్ట ప్రక్రియలో భాగంగా ముందుగా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. (వివరాలు 7లో..)



## శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**ఆణివార ఆస్థానానికి ముందు తిరుమల శుద్ధి**

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17న జరిగే సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రతి ఏడాది ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి ప్రధాన ఉత్సవాలకు ముందు ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం తిరుమలలో చిరకాల ఆనవాయితీగా కొనసాగుతోంది. (7లో..)




## ఓటర్ల జాబితా సవరణ
# గడువు పెంపు

- పది రోజుల పాటు ఏపీకి ఈసీ ఊరట
- అక్టోబర్ 3 వరకు ఓటర్ల పరిశీలన

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎన్నికల సంఘం గడువు పెంచింది. ఈ రెండు రాష్ట్రాలు మే 14న ప్రారంభమైన మూడో దశ ఎస్ఐఆర్‌లో భాగంగా ఉన్నాయి. మొత్తం 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఓటర్ల వివరాలను మరింత ఖచ్చితంగా నమోదు చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.

### జూలై 24 వరకు ఇంటింటి పరిశీలన

బూత్ లెవల్ అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను జూలై 24 వరకు కొనసాగించాలని ఈసీ ఆదేశించింది. ముందుగా ఈ గడువు జూలై 14తో ముగియాల్సి ఉంది. సర్వే పూర్తయ్యాక రూపొందించే ముసాయిదా ఓటర్ల జాబితాను జూలై 21న విడుదల చేయాలని నిర్ణయించినా, తాజా మార్పులతో జూలై 31న ప్రచురించనున్నారు. దీంతో అర్హులైన ఓటర్ల వివరాలను మరింత సమగ్రంగా నమోదు చేసే అవకాశం లభించనుంది.

### తుది జాబితా అక్టోబర్ 3న

సవరించిన షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 3న విడుదల చేయనున్నారు. ఇది ముందుగా ప్రకటించిన తేదీ కంటే వారం రోజుల ఆలస్యం. అభ్యంతరాలు, దరఖాస్తులు, పరిశీలన ప్రక్రియకు తగిన సమయం ఇవ్వాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.

### దేశవ్యాప్తంగా మూడో దశ కొనసాగింపు

మూడో దశ ఎస్ఐఆర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, జార్ఖండ్, మేఘాలయతో పాటు మరికొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో కలిపి సుమారు 36.73 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటివరకు ముసాయిదా జాబితాలు విడుదలైన ఐదు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సుమారు 23.82 లక్షల పేర్లు తొలగించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఇది మొత్తం నమోదైన ఓటర్లలో 6.39 శాతం.

### మూడు ప్రాంతాల్లో తర్వాత షెడ్యూల్

ఈ దశ పూర్తయిన తర్వాత దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పూర్తవుతుంది. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాలకు మాత్రం తర్వాత షెడ్యూల్ ప్రకటించనున్నారు. జనగణన రెండో దశ పూర్తయ్యే సమయం, మంచు పరిస్థితులు, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అక్కడి కార్యక్రమాల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించనుంది. దీంతో దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలను మరింత ఖచ్చితంగా రూపొందించే ప్రక్రియ చివరి దశకు చేరుకోనుంది.




# చమురు షాక్

- మార్కెట్ పతనం
- ₹ 3 లక్షల కోట్ల సంపద ఆవిరి
- అమ్మకాలతో కుప్పకూలిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం భారీ ఒత్తిడిని ఎదుర్కొంది. సెన్సెక్స్ 561 పాయింట్లు పడిపోయి 77,055 వద్ద ముగిసింది. నిఫ్టీ 159 పాయింట్లు కోల్పోయి 24,052 వద్ద నిలిచింది. ఆటో, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ షేర్లలో భారీ అమ్మకాలు జరిగాయి. ఈ పతనంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గిపోయింది. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసిన అనేక పరిణామాలు ఒకేసారి ప్రభావం చూపాయి.

### చమురు ధరలే తొలి దెబ్బ

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ పెరగడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 87 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో సైనిక ఉద్రిక్తతలు పెరగడం ప్రపంచ చమురు సరఫరాపై ఆందోళన కలిగించింది. చమురు ధరలు పెరగడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్‌కు అదనపు భారం ఏర్పడుతుందనే భయం మార్కెట్‌ను బలంగా ప్రభావితం చేసింది.

### వడ్డీ రేట్ల భయాలు పెరిగాయి

భారత్‌లో జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం 17 నెలల తర్వాత మళ్లీ రిజర్వ్ బ్యాంక్ లక్ష్యమైన 4 శాతాన్ని దాటి 4.38 శాతానికి చేరింది. ఆహార పదార్థాలు, ఇంధన ధరల పెరుగుదల దీనికి ప్రధాన కారణంగా నిలిచాయి. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ కూడా ద్రవ్యోల్బణం అదుపులోకి రాకపోతే సమీప కాలంలో వడ్డీ రేట్లు పెరిగే అవకాశం ఉందని సంకేతాలు ఇవ్వడంతో పెట్టుబడిదారులు అప్రమత్తమయ్యారు.

### హెచ్‌సీఎల్ టెక్ ఫలితాల ప్రభావం

ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ తొలి త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయాయి. కంపెనీ భవిష్యత్ మార్గదర్శకాలు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఐటీ రంగంపై ఆందోళనలు పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్ షేరు నాలుగు శాతానికి పైగా పడిపోగా, ఇతర ఐటీ కంపెనీల షేర్లపైనా విక్రయ ఒత్తిడి కనిపించింది. ఈ వారం రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ సంస్థల ఫలితాలపై కూడా మార్కెట్ దృష్టి కేంద్రీకరించింది.

### రూపాయి బలహీనత.. ప్రపంచ సంకేతాల ప్రభావం

రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 96 మార్క్‌ను దాటి బలహీనపడింది. పెరుగుతున్న చమురు ధరలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు రూపాయిపై ఒత్తిడి తెచ్చాయి. అమెరికా మార్కెట్లు కూడా నష్టాలతో ముగియడం, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల్లో నెలకొన్న ఆందోళనలు భారత మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు, అంతర్జాతీయ పరిణామాలే రానున్న రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే ప్రధాన అంశాలుగా మారనున్నాయి.

# కాపు ఉద్యమంలో చెరగని 'ముద్ర'

- సుదీర్ఘ పోరాటంలో అలసి శాశ్వత నిద్ర
- కాపు గర్జనకు దిక్సూచి... ఉద్యమ జ్వాలకు చిరునామా



ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో కొందరు నాయకులు అధికారంతో గుర్తింపు పొందుతారు. మరికొందరు ఎన్నికల విజయాలతో తమ ముద్ర వేస్తారు. కానీ చాలా అరుదుగా కొందరు మాత్రమే ఒక సామాజిక ఉద్యమానికే ప్రతీకలుగా నిలుస్తారు. పదవులు, పార్టీలు, ఎన్నికల విజయాలు, పరాజయాలన్నింటినీ దాటి ఒక వర్గం ఆకాంక్షలకు, ఆవేదనకు, ఆత్మగౌరవానికి ప్రతినిధులుగా మారిపోతారు. అలాంటి అరుదైన నాయకుల్లో ముద్రగడ పద్మనాభం ఒకరు. వంగవీటి మోహనరంగా తర్వాత కాపు సామాజిక వర్గానికి ఉద్యమ స్వరంగా వినిపించిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ముద్రగడ పద్మనాభమే. ఆయన రాజకీయ జీవితం ఎన్నో మలుపులు తిరిగినా, ప్రజల జ్ఞాపకాల్లో మాత్రం "కాపు ఉద్యమ నాయకుడు"గానే నిలిచిపోయారు. అందుకే ఆయన మరణం ఒక మాజీ మంత్రి మరణం మాత్రమే కాదు... నాలుగు దశాబ్దాలకుపైగా సాగిన ఒక ఉద్యమ రాజకీయానికి తెరపడిన క్షణం. హైదరాబాద్‌లో అనారోగ్యంతో ఆయన తుదిశ్వాస విడిచిన వార్త వెలువడగానే కాపు సమాజంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎన్నో నిరాహార దీక్షలు, ఆందోళనలు, అరెస్టులు, పోలీసు నిర్బంధాలు, రాజకీయ ఘర్షణలు, ఆశలు, నిరాశలు, విజయాలు, వైఫల్యాలన్నింటినీ తన జీవితంలో మోసిన నాయకుడు ఇక లేరనే భావన ఒక శూన్యతను మిగిల్చింది.

### కిర్లంపూడి నుంచి అసెంబ్లీ వరకు

1953 జనవరి 22న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ పద్మనాభం రాజకీయ వారసత్వం ఉన్న కుటుంబంలో పెరిగారు. ఆయన తండ్రి వీర రాఘవరావు ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన నాయకుడు. చిన్ననాటి నుంచే గ్రామీణ సమస్యలు, రైతు కష్టాలు, సామాజిక అసమానతలను దగ్గరగా చూసిన ముద్రగడలో ప్రజాజీవితంపై ఆసక్తి పెరిగింది. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నిక కావడంతో ఆయన రాజకీయ ప్రయాణం ప్రారంభమైంది. అనంతరం 1983, 1985 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ప్రతిపాదు నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధించారు. ఎన్టీ రామారావు మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. అయితే అధికార పదవికంటే తన అభిప్రాయాలకు విలువ ఇచ్చిన నాయకుడిగా నిలిచారు. విభేదాలు వచ్చినప్పుడు మంత్రి పదవికి రాజీనామా చేయడానికీ వెనుకాడలేదు. తరువాత ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీ, కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ, తిరిగి తెలుగుదేశం పార్టీ, ఆపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ... ఇలా ఆయన రాజకీయ ప్రస్థానం అనేక పార్టీల గుండా సాగింది. అయితే పార్టీలు మారినా ప్రజలు ఆయనను గుర్తుపట్టింది మాత్రం ఒకే కారణంతో——కాపు ఉద్యమం.

### పార్టీలు మారినా... పోరాటం ఆగలేదు

ముద్రగడ పద్మనాభం జీవితంలో అత్యంత శక్తివంతమైన అధ్యాయం కాపు రిజర్వేషన్ ఉద్యమం. విద్యా, ఉద్యోగ అవకాశాల్లో కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన దశాబ్దాల పాటు నిరంతర పోరాటం సాగించారు. ప్రభుత్వాలు మారాయి. ముఖ్యమంత్రులు మారారు. ఎన్నికలు వచ్చాయి, వెళ్లాయి. కానీ ముద్రగడ ఉద్యమం మాత్రం ఆగలేదు. ఆయన చేపట్టిన నిరాహార దీక్షలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఒక పిలుపునిస్తే వేలాది మంది రోడ్లపైకి వచ్చేవారు. ఒక దీక్ష ప్రారంభిస్తే ప్రభుత్వం స్పందించక తప్పని పరిస్థితులు ఏర్పడేవి. 1994 ఎన్నికల తర్వాత నుంచి, ముఖ్యంగా 2000ల దశకంలో, కాపు రిజర్వేషన్ అంశాన్ని మళ్లీ రాజకీయ చర్చల్లోకి తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2016లో తుని ప్రాంతంలో జరిగిన "కాపు గర్జన" అనంతరం ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ సంఘటన తర్వాత కాపు రిజర్వేషన్ ప్రశ్న రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలక అంశంగా మారింది. ఆ ఉద్యమం వెనుక నిలిచిన ప్రధాన ముఖచిత్రం ముద్రగడ పద్మనాభమే.

### వంగవీటి రంగా తర్వాత ఉద్యమ స్వరం

1988 డిసెంబర్ 26న వంగవీటి మోహనరంగా హత్య అనంతరం కాపు సమాజంలో ఏర్పడిన భావోద్వేగ నాయకత్వ లోటును ఉద్యమ పరంగా ఎక్కువకాలం భర్తీ చేసిన వ్యక్తి ముద్రగడ. రంగా ఒక భావోద్వేగ ప్రతీక అయితే, ముద్రగడ ఉద్యమ రాజకీయాలకు ప్రతీకగా నిలిచారు. ఆయన సభలు కాపు సమాజంలో ఐక్యతకు వేదికలయ్యాయి. యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచాయి. కాపు సమాజం హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడాలని ఆయన నిరంతరం పిలుపునిచ్చారు. అందుకే "కాపు ఉద్యమం అంటే ముద్రగడ... ముద్రగడ అంటే కాపు ఉద్యమం" అనే భావన బలపడింది. ముద్రగడ పోరాటం ఎన్నో ప్రభుత్వాలను కదిలించింది. కమిషన్లు ఏర్పడ్డాయి. హామీలు వచ్చాయి. ఎన్నికల మేనిఫెస్టోల్లో కాపు రిజర్వేషన్ పదేపదే చోటు దక్కింది. అయితే ఆయన జీవితంలో అతిపెద్ద బాధ ఏమిటంటే——దశాబ్దాల పోరాటం చేసినప్పటికీ కాపు రిజర్వేషన్ అంశానికి పూర్తి స్థాయి రాజ్యాంగబద్ధ పరిష్కారం లభించకపోవడం. ఉద్యమం ప్రజల్లో చైతన్యం తెచ్చింది. రాజకీయ చర్చను మార్చింది. కానీ ఆయన ఆశించిన గమ్యాన్ని పూర్తిగా చేరుకోలేకపోయింది.

### 2024... రాజకీయంగా అతిపెద్ద మలుపు

2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముద్రగడ రాజకీయ జీవితంలో కీలక మలుపుగా నిలిచాయి. ఆ ఎన్నికలకు ముందు ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ నిర్ణయం కాపు సమాజంలోనే విభిన్న అభిప్రాయాలకు దారితీసింది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ఓడిస్తానని ఆయన బహిరంగంగా ప్రకటించారు. "అలా జరగకపోతే నా పేరు మార్చుకుంటాను" అని కూడా సవాలు విసిరారు. అయితే 2024 జూన్ 4న వెలువడిన ఎన్నికల ఫలితాల్లో పవన్ కళ్యాణ్ ఘన విజయం సాధించారు. అనంతరం తన మాట ప్రకారం ముద్రగడ అధికారికంగా తన పేరును "ముద్రగడ పద్మనాభ రెడ్డి"గా మార్చుకున్నారు. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో విశేష చర్చకు దారితీసింది. కొంతమంది దాన్ని ఆయన మాట నిలబెట్టుకున్న వ్యక్తిత్వంగా అభివర్ణించగా, మరికొందరు ఉద్యమ నాయకుడికి తగిన నిర్ణయం కాదని విమర్శించారు. కానీ ముద్రగడ తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజా చర్చకు దారి తీసిందన్నది మాత్రం వాస్తవం.

### ప్రశంసలూ... విమర్శలూ... రెండూ వెంట నడిచాయి

ముద్రగడ రాజకీయ జీవితం ప్రశంసలు, విమర్శలు రెండింటితో కూడుకున్నది. అభిమానులు ఆయనను కాపు ఆత్మగౌరవానికి ప్రతీకగా కీర్తించారు. విమర్శకులు ఆయన రాజకీయ నిర్ణయాలను ప్రశ్నించారు. అయితే ఈ భిన్నాభిప్రాయాలన్నింటినీ దాటి నిలిచిన సత్యం ఒక్కటే——ఆంధ్రప్రదేశ్‌లో కాపు ఉద్యమ చరిత్రను ముద్రగడ పద్మనాభం పేరు లేకుండా రాయడం అసాధ్యం. ఆరోగ్య సమస్యలు ఆయనను చివరి దశలో ప్రజలకు దూరం చేశాయి. మూత్రపిండాల సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన మరణంతో రాజకీయ ప్రత్యర్థులు సైతం ఆయన ఉద్యమస్ఫూర్తిని స్మరించారు. కాపు సమాజం తమ ఉద్యమానికి చిరునామాగా నిలిచిన నాయకుడిని కోల్పోయింది.

### ఉద్యమం కొనసాగుతుంది... నాయకుడు చరిత్రలో కలిశాడు

ముద్రగడ పద్మనాభం జీవితాన్ని కేవలం ఎన్నికల గెలుపోటములతో కొలవలేం. ఆయన అసలు గుర్తింపు మంత్రి పదవి కాదు. ఎమ్మెల్యే, ఎంపీ హోదాలు కాదు. ఆయన అసలు గుర్తింపు ఉద్యమం. ఆయన రాజకీయ సంపద ప్రజల విశ్వాసం. ఆయన వారసత్వం కాపు ఆత్మగౌరవ పోరాటం. రాజకీయాల్లో అధికారాలు శాశ్వతం కావు. పార్టీలు మారుతాయి. నాయకత్వాలు మారుతాయి. కానీ సమాజ చరిత్రలో కొన్ని పేర్లు ఉద్యమాలకు ప్రతీకలుగా శాశ్వతమవుతాయి. ముద్రగడ పద్మనాభం అలాంటి నాయకుడు. ఆయన మరణంతో ఒక ఉద్యమం ముగియలేదు. కానీ ఆ ఉద్యమానికి దశాబ్దాల పాటు దిక్సూచిగా నిలిచిన ఒక స్వరం మూగబోయింది. ఒక యుగం ముగిసింది. ఒక రాజకీయ అధ్యాయం చరిత్రలో కలిసిపోయింది. హైదరాబాద్‌లో ఆయన శ్వాస ఆగిపోయి ఉండవచ్చు. కానీ కిర్లంపూడి నుంచి ప్రారంభమైన ఆయన పోరాటం, కాపు ఆత్మగౌరవం కోసం సాగించిన నిరంతర యాత్ర, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. వంగవీటి మోహనరంగా తర్వాత కాపు ఉద్యమానికి అత్యంత ప్రభావవంతమైన స్వరంగా నిలిచిన ముద్రగడ పద్మనాభం ఇక లేరు. కానీ ఉద్యమాన్ని రాజకీయాల కంటే గొప్పదిగా నమ్మిన ఆయన పేరు... కాపు సమాజ చరిత్రలో, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో, పోరాటానికి పర్యాయపదంగా శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

# కొత్త అవతారమెత్తిన స్ట్రాటజిస్ట్

- బీహార్ ఉప ఎన్నికలో పీకే కంటెస్ట్
- అంచనాలకందని ప్రాపర్టీ
- గెలుపుపై లేదు షూరిటీ

శకునాలు చెప్పి రాజకీయాలను మలిచిన వ్యూహకర్తగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్.. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల బరిలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బ్యాంకీపూర్ ఉప ఎన్నికలో నామినేషన్ దాఖలు చేసిన ఆయన అఫిడవిట్‌లో రూ.208 కోట్ల ఆస్తులను ప్రకటించడంతో బిహార్ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేచింది.

బిహార్‌లోని బ్యాంకీపూర్ అసెంబ్లీ ఉప ఎన్నిక ఆసక్తికరంగా మారింది. జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సోమవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఇదే స్థానానికి బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హా కూడా నామినేషన్ సమర్పించారు. నామినేషన్ సందర్భంగా ఇరు పార్టీల నేతలు భారీ రోడ్ షోలు నిర్వహించారు. ఈ ఉప ఎన్నికకు జూలై 30న పోలింగ్ జరగనుండగా, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.



### రూ.208 కోట్ల ఆస్తుల వివరాలు

ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ ప్రకారం ప్రశాంత్ కిశోర్, ఆయన భార్య జాహ్నవి దాస్ పేర్లపై మొత్తం రూ.208.00 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు ఉన్నాయి. ఇందులో ప్రశాంత్ కిశోర్ పేరుపై రూ.96 కోట్లకు పైగా ఆస్తులు ఉండగా, జాహ్నవి దాస్ పేరుపై రూ.111 కోట్లకు పైగా ఆస్తులు నమోదయ్యాయి. కుటుంబం మొత్తం కలిపి ఈ భారీ ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించింది. జాహ్నవి దాస్ ఎంబీబీఎస్ పూర్తి చేసి ఢిల్లీలోని అపోలో ఇంద్రప్రస్థ ఆస్పత్రిలో సీనియర్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. ఆమె వద్ద 475 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వారి కుమారుడు దైబిక్ భరద్వాజ్ పేరుపై కూడా రూ.7.19 లక్షల చరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు.

### కంపెనీ విరాళాల వివరాలు

ప్రశాంత్ కిశోర్ ఆధ్వర్యంలోని వేదాస్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆయనకు వంద శాతం వాటా ఉంది. ఈ సంస్థ 2024-25లో జనసురాజ్ పార్టీకి రూ.85 కోట్ల విరాళం ఇచ్చినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. జనసురాజ్ ఫౌండేషన్‌కు రూ.50 లక్షలు, జాయ్ ఆఫ్ గివింగ్ గ్లోబల్ ఫౌండేషన్‌కు రూ.2.75 కోట్ల విరాళాలు ఇచ్చిన వివరాలను కూడా వెల్లడించారు. ప్రశాంత్ కిశోర్ హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ పూర్తి చేశారు. అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ప్రత్యేక హెల్త్‌కేర్ శిక్షణ పొందారు. ఫ్రాన్స్‌లో ఇంటెన్సివ్ ఫ్రెంచ్ భాషా కోర్సు కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయనపై ఎనిమిది క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఎక్కువ కేసులు అక్రమంగా గుమికూడిన ఘటనలకు సంబంధించినవే. అయితే ఏ కేసులోనూ ఆయన దోషిగా తేలలేదు.

### ఉప ఎన్నికపై దృష్టి

రాజ్యసభకు నితిన్ నవీన్ ఎన్నిక కావడంతో బ్యాంకీపూర్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఈ ఉప ఎన్నికను బిహార్ రాజకీయాల్లో కీలక పోరుగా భావిస్తున్నారు. రాజకీయ వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రశాంత్ కిశోర్ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో నిలవడం కూడా ఈ పోటీకి ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన ఆస్తుల వివరాలు బయటకు రావడంతో ఎన్నికల ప్రచారంలో కొత్త చర్చ మొదలైంది.

# నేపాల్ లో జెన్‌జీ వెక్స్

(మొదటి పేజీ తరువాయి..)

జూలై 9న పార్కింగ్ వివాదం తర్వాత నగర పోలీసులతో ఘర్షణకు దిగిన ఓ రైడ్ హైలింగ్ డ్రైవర్ ఆత్మాహుతికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మరుసటి రోజు మరణించాడు. మరోవైపు కాఠ్మాండు నదీ తీరాల నుంచి ఖాళీ చేయించిన నిరాశ్రయ కుటుంబాలకు ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరం వర్షాలతో మునిగిపోయింది. ఈ రెండు సంఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బయటపెట్టాయని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పరిణామాల తర్వాత కాఠ్మాండుతో పాటు పలు ప్రాంతాల్లో నిరసనలు ప్రారంభమయ్యాయి. పరిపాలనలో వైఫల్యం, సరైన ప్రణాళిక లేకపోవడం, అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరించడం ప్రజల్లో ఆగ్రహానికి కారణమయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

### మౌనమే విమర్శలకు కారణం

మాజీ కాఠ్మాండు మేయర్‌గా ఉన్నప్పటి నుంచి బలేంద్ర షా ఎక్కువగా సామాజిక మాధ్యమాల ద్వారానే స్పందిస్తూ వచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయి. 100 రోజుల కాలంలో ఒక్కసారి మాత్రమే బహిరంగ ప్రసంగం చేశారు. పార్లమెంట్‌లో కూడా ఒక్కసారి మాత్రమే మాట్లాడారు. ఇటీవలి రెండు కీలక ఘటనలపై ఇప్పటివరకు స్పందించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచింది. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న యువ కార్యకర్తల అరెస్టులు కూడా వివాదానికి దారితీశాయి. నిరాశ్రయ కుటుంబాలకు మద్దతుగా నిరసన తెలిపిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయవాది, యువ ఉద్యమకారుడు మజిద్ అన్సారీ అరెస్టు సమయంలో గాయపడ్డాడు. తన అరెస్టుకు కారణమే తెలియజేయలేదని ఆసుపత్రి నుంచి సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నాడు. అతడిని వెంటనే విడుదల చేయాలని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది.

### పాత ప్రభుత్వమే గుర్తొస్తోందా?

జూలై 13న కాఠ్మాండులోని ప్రముఖ మీడియా సంస్థల గేట్ల ముందు యజమానులు లేకుండా వాహనాలను నిలిపివేయడం మరో వివాదానికి దారితీసింది. ఒక వాహనం అధికార పార్టీ సభ్యుడికి చెందినదిగా గుర్తించారు. ప్రభుత్వాన్ని విమర్శించే మీడియాను భయపెట్టే ప్రయత్నమిదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఈ అంశం పార్లమెంట్‌లోనూ చర్చకు వచ్చింది. 2025 యువత ఉద్యమం తర్వాత అధికారంలోకి వచ్చిన బలేంద్ర షా ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతామని హామీ ఇచ్చింది. ఇప్పుడు అదే ప్రభుత్వం విమర్శలను అణచివేస్తోందనే ఆరోపణలు ఎదుర్కొంటోంది. ప్రజల ఆశలు నెరవేరకపోవడంతో ప్రభుత్వంపై నమ్మకం క్రమంగా తగ్గుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సంస్కరణల పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా పాత పాలకుల బాటలోనే నడుస్తోందనే అభిప్రాయం నేపాల్ రాజకీయాల్లో బలపడుతోంది.

# సాయికృష్ణ కేసులో కీలక మలుపు

- సీబీఐ విచారణపై వెనక్కి తగ్గిన తల్లి
- పిటిషన్ ఉపసంహరించుకున్న విజయలక్ష్మి



అక్రమ నిర్బంధం, చిత్రహింసలు, కస్టడీ మరణం ఆరోపణలతో వెలుగులోకి వచ్చిన గాదె సాయికృష్ణ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి హైకోర్టులో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం కొత్త పిటిషన్ దాఖలు చేశారు. ఈ నిర్ణయం కేసు విచారణలో కొత్త చర్చకు దారితీసింది.

### మే 6న అదుపులోకి తీసుకున్న పోలీసులు

సాయికృష్ణపై రెండు నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండటంతో మే 6న ఎన్‌టీఆర్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కృష్ణలంక పోలీసులు కలిసి మార్కాపురంలో అదుపులోకి తీసుకున్నారు. అదే రోజు అతడిని కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత సాయికృష్ణ కనిపించకపోవడంతో అతడి తల్లి హైకోర్టును ఆశ్రయిస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలున్నప్పటికీ సాయికృష్ణను హాజరుపరచకపోవడంతో విచారణ కొనసాగుతోంది.

### సీబీఐ విచారణ పిటిషన్‌పై స్పష్టత

సాయికృష్ణ కస్టడీ మరణంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ మరో పిటిషన్ కూడా హైకోర్టులో దాఖలైనట్లు సమాచారం. అయితే ఆ పిటిషన్ గురించి తనకు ఎలాంటి సమాచారం లేదని విజయలక్ష్మి వెల్లడించినట్లు తెలిసింది. తాను దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను మాత్రమే ఉపసంహరించుకోవాలని కోర్టును కోరినట్లు సమాచారం.

### నేడు హైకోర్టులో విచారణ

సాయికృష్ణ కేసుకు సంబంధించిన పిటిషన్లు బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది. హెబియస్ కార్పస్ పిటిషన్ ఉపసంహరణపై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది, సీబీఐ దర్యాప్తు కోరిన పిటిషన్‌పై ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందనే అంశాలపై ఆసక్తి నెలకొంది. ఈ కేసులో వెలుగులోకి వస్తున్న ప్రతి పరిణామం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.




# భోజ్‌శాల వివాదం

- తాత్కాలిక నమాజ్‌కు అనుమతి
- సుప్రీంకోర్టు కీలక ఆదేశం

మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఉన్న భోజ్ శాల - కమల్ మౌలా మసీదు వివాదంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరిస్థితిని వెంటనే మార్చబోమని స్పష్టం చేసింది. ఈ అంశం అత్యంత సున్నితమైనదని పేర్కొంటూ ఉద్రిక్తత పెరిగేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని తెలిపింది. కేసుపై త్వరితగతిన రోజువారీ విచారణ చేపట్టి తుది తీర్పు ఇస్తామని ధర్మాసనం వెల్లడించింది.

### ముస్లింలకు తాత్కాలిక ఏర్పాట్లు

తుది తీర్పు వచ్చే వరకు ముస్లిం సమాజం శుక్రవారం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల మధ్య నమాజ్ నిర్వహించేందుకు వివాదాస్పద ప్రదేశానికి సమీపంలో ఖాళీ స్థలాన్ని గుర్తించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని స్పష్టం చేసింది. శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. వివాదాస్పద నిర్మాణంలో ఎలాంటి మార్పులు చేయొద్దని పురావస్తు శాఖకు సుప్రీంకోర్టు ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా నిర్మాణంలో మార్పులు చేయడం, కొత్త పనులు చేపట్టడం పూర్తిగా నిషేధించింది. కేంద్ర ప్రభుత్వం, మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసి వారి అభిప్రాయాలను కోరింది.

### వాదనలు ఇలా... ప్రభుత్వం స్పందన

పిటిషనర్ల తరఫు న్యాయవాదులు మత సామరస్యాన్ని కాపాడాలని కోర్టును కోరారు. 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఉద్దేశం ఇలాంటి వివాదాలు తలెత్తకుండా చూడడమేనని వాదించారు. అయోధ్య కేసు మినహాయింపు మాత్రమేనని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా రెండు వర్గాలు ఒకే ప్రాంగణంలో తమ తమ ప్రార్థనలు నిర్వహించిన పరిస్థితిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత రెండు నెలలకే అప్పీలు వచ్చాయని కోర్టుకు తెలిపారు. రెండు వర్గాలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ అంశంపై కోర్టులో జరిగే వ్యాఖ్యలను బయట తప్పుగా అర్థం చేసుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

### తుది తీర్పు ఎదురుచూపు

ఈ ఏడాది మే 15న మధ్యప్రదేశ్ హైకోర్టు భోజ్ శాల ప్రాంగణాన్ని సరస్వతి దేవికి అంకితమైన ఆలయంగా ప్రకటించింది. శుక్రవారం నమాజ్‌కు అనుమతి ఇచ్చిన పాత పురావస్తు శాఖ ఉత్తర్వులను రద్దు చేసింది. భోజ్ శాల నిర్వహణ బాధ్యతలపై నిర్ణయం తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వం, పురావస్తు శాఖకు ఉందని పేర్కొంది. అదే తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హిందూ వర్గం భోజ్ శాలను సరస్వతి దేవాలయంగా భావిస్తోంది. ముస్లిం వర్గం మాత్రం 11వ శతాబ్దానికి చెందిన కమల్ మౌలా మసీదుగా పేర్కొంటోంది. ప్రస్తుతం ఈ ప్రాంగణం పురావస్తు శాఖ సంరక్షణలో ఉంది. సున్నితమైన ఈ వివాదానికి సుప్రీంకోర్టు తుది తీర్పు కోసం దేశవ్యాప్తంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఇండియాకు చైనా థ్రెట్

- పెరుగుతున్న డ్రాగన్ దిగుమతులు
- భారత్‌కు పెరుగుతున్న సవాలు
- ముప్పుగా మారుతున్న ఆర్థిక లోటు



2026 తొలి ఆరు నెలల్లో చైనా నుంచి భారత్ దిగుమతులు భారీగా పెరిగాయి. ఈ కాలంలో దిగుమతుల విలువ 79.41 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 21.8 శాతం అధికం. ఇదే కాలంలో ఇరు దేశాల మధ్య మొత్తం ద్వైపాక్షిక వాణిజ్యం 91.72 బిలియన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే 23.6 శాతం వృద్ధి నమోదైంది. ఇదే ధోరణి కొనసాగితే 2025లో నమోదైన 155.62 బిలియన్ డాలర్ల రికార్డును ఈ ఏడాది అధిగమించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి.

### ఎగుమతుల్లోనూ ఊపు

భారత్ నుంచి చైనాకు వెళ్లే ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి. తొలి ఆరు నెలల్లో 12.31 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు చైనాకు ఎగుమతి అయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 37.2 శాతం అధికం. అయినప్పటికీ చైనా నుంచి దిగుమతుల స్థాయి చాలా ఎక్కువగా ఉండటంతో వాణిజ్య లోటు 67.1 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ ఏడాది చివరికి ఇది గత ఏడాది నమోదైన రికార్డు స్థాయిని దాటే అవకాశముంది.

### చైనాపై ఆధారపడుతున్న పరిశ్రమలు

జూన్ నెలలో భారత్ మొత్తం వాణిజ్య లోటు 15.3 బిలియన్ డాలర్లకు చేరింది. ఏడాది క్రితంతో పోలిస్తే ఇది 430 శాతం అధికం. ముడి చమురు, బంగారం, ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులు భారీగా పెరగడం ఇందుకు ప్రధాన కారణమని అధికారిక గణాంకాలు వెల్లడించాయి. భారత్ చైనా నుంచి పూర్తయిన ఎలక్ట్రానిక్ వస్తువులు మాత్రమే కాకుండా పరిశ్రమలకు అవసరమైన విడి భాగాలు, మధ్యంతర ఉత్పత్తులను కూడా పెద్ద ఎత్తున దిగుమతి చేసుకుంటోంది. వీటితో దేశీయ తయారీ రంగం కొనసాగుతోంది. ఎగుమతుల తయారీలో కూడా ఈ దిగుమతుల పాత్ర కీలకంగా ఉంది. అందుకే వాణిజ్య లోటు కంటే దిగుమతి వస్తువుల స్వభావంపైనే ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెడుతోంది.

### ఫార్మా రంగంపై భారత్ ఆశలు

చైనాకు భారత్ ప్రధానంగా సేంద్రియ రసాయనాలు, ఖనిజాలు, సముద్ర ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఇవి తక్కువ విలువ కలిగిన ఉత్పత్తులుగా భావిస్తున్నారు. అధిక విలువ కలిగిన వస్తువుల ఎగుమతులు పెరిగితే వాణిజ్య సమతుల్యత మెరుగుపడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చైనాలో భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి ఇటీవల భారత ఎగుమతులను విస్తరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా ఔషధ రంగంలో భారత్ ప్రపంచస్థాయిలో పోటీ సామర్థ్యం కలిగి ఉందని చెప్పారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే విధానాలతో పాటు రెండు దేశాలకు ఉపయోగపడేలా వాణిజ్యాన్ని విస్తరించాలని సూచించారు. విలువ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతులు పెరిగితే వాణిజ్య లోటు ప్రభావం కూడా తగ్గే అవకాశముందని అభిప్రాయపడ్డారు.

# కొత్త పెట్రోల్.. చేతికి చమురు

- ఈ20 ఇంధనంపై విమర్శలు..
- ఇథనాల్ విమర్శలు-కేంద్రం క్లారిటీ




ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ20)పై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి వివరణ ఇచ్చింది. ఇథనాల్ కలపడం వల్ల మైలేజ్ తగ్గుతుందా? పర్యావరణానికి ఎంత ఉపయోగం? ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్ ధరలు ఎందుకు తగ్గడం లేదు? వంటి ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు విడుదల చేసింది. ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడమే లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

### ఈ20 అంటే ఏమిటి?

ప్రస్తుతం దేశంలో విక్రయిస్తున్న పెట్రోల్‌ను ఈ20గా పిలుస్తున్నారు. అంటే ప్రతి లీటర్ పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలిపి ఉంటుంది. దేశంలో ఇథనాల్ వినియోగాన్ని మరింత పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఈ22, ఈ25, ఈ27, ఈ30 ఇంధనాలకు అవసరమైన నాణ్యత ప్రమాణాలను ప్రకటించింది. అధిక ఇథనాల్ మిశ్రమ ఇంధనాలకు కేంద్ర ఎక్సైజ్ సుంకంలో రాయితీలు కూడా ప్రకటించింది.

### ధరలు ఎందుకు తగ్గడం లేదు?

ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్ ధరలు అదే స్థాయిలో ఉండటంపై ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇథనాల్ ధరలు ముడి చమురు ధరల మాదిరిగా తరచూ తగ్గవని తెలిపింది. ఇథనాల్ వాటా పెరిగేకొద్దీ పెట్రోల్ ధరల్లో తగ్గుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులకు చేరకపోవచ్చని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇథనాల్ శాతం పెరిగితే ఈ పరిస్థితి మరింత స్పష్టంగా కనిపించే అవకాశం ఉందని పేర్కొంది.

### పర్యావరణానికి ప్రయోజనం

ఇథనాల్ మిశ్రమ ఇంధనం వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని కేంద్రం వెల్లడించింది. చమురుపై ఆధారపడటం తగ్గడంతో విదేశీ మారక ద్రవ్య వ్యయం కూడా తగ్గుతుందని తెలిపింది. అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో చమురు సరఫరాలో అంతరాయం వచ్చినా దేశీయ ఇంధన భద్రతకు ఇథనాల్ ఉపయోగపడుతుందని ప్రభుత్వం వివరించింది.

### రైతులకు అదనపు ఆదాయం

ఇథనాల్ తయారీలో చెరకు, మొక్కజొన్న వంటి వ్యవసాయ పంటలు ఉపయోగిస్తున్నారు. దీంతో రైతులకు కొత్త మార్కెట్ లభిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అభిప్రాయపడుతోంది. దేశీయంగా ఇంధన ఉత్పత్తిని పెంచడం ద్వారా దిగుమతులపై ఆధారపడటం కూడా తగ్గుతుందని పేర్కొంది.

### ఈ30 లక్ష్యంగా అడుగులు

ప్రస్తుతం అమలులో ఉన్న ఈ20 విధానాన్ని క్రమంగా ఈ30 స్థాయికి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ప్రమాణాలు ఇప్పటికే సిద్ధం చేసింది. భవిష్యత్తులో ఇథనాల్ మిశ్రమ ఇంధనాల వినియోగం మరింత విస్తరించనున్న నేపథ్యంలో వాహన తయారీ సంస్థలు కూడా అనుగుణంగా సాంకేతిక మార్పులు చేపడుతున్నాయి. ఇంధన భద్రత, పర్యావరణ పరిరక్షణ, దేశీయ ఉత్పత్తి పెంపు లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.



## కాపు సమాజపు నేత ముద్రగడ పద్మనాభంకు అశ్రు నివాళి

అలలెన్ని ఎగసినా
ఆత్మగౌరవ తీరం చెదరదని
నేర్పిన స్వరం నీవు...

అవమానాల అగ్నిలోనూ
ఆత్మవిశ్వాసపు అక్షరాలు చెక్కిన
సంకల్పం నీవు...

ఒక మనిషి వెళ్లిపోవచ్చు...
కానీ.. ఒక ఉద్యమం
నడిచిన అడుగులు
కాలం చెరపలేని చరిత్రగా
మిగులుతాయి.

నువ్వు పలికిన ప్రతి మాటలో
ఒక జాతి గుండెచప్పుడు
వినిపించింది...
నువ్వు నడిచిన ప్రతి దారిలో
ఆత్మగౌరవం జెండాగా
రెపరెపలాడింది.

మరణం శరీరాన్ని మాత్రమే
మౌనంలోకి తీసుకెళ్తుంది...
ఆలోచనలను కాదు...
ఆదర్శాలను కాదు...
ప్రజల గుండెల్లో వెలిగే
జ్ఞాపకాలను కాదు...

నీవు ఆగింది ప్రయాణం కాదు...
ఒక తరానికి దిక్సూచిగా
నిలిచిన దీపస్తంభం.

నీ జ్ఞాపకం
కన్నీటి బిందువుగా కాదు...
ఆత్మగౌరవపు అగ్నికణంగా
తరతరాల హృదయాల్లో
వెలుగుతూనే ఉంటుంది.

అశ్రునివాళి...
ముద్రగడ పద్మనాభం గారి స్మృతిలో

హుస్సేన్...



# గ్రాహం స్టెయిన్స్ హత్య కేసు

- దారా సింగ్ విడుదలకు మార్గం
- 26 ఏళ్ల తర్వాత స్వేచ్ఛ

ఆస్ట్రేలియా క్రైస్తవ మిషనరీ గ్రాహం స్టెయిన్స్ హత్య కేసులో ప్రధాన దోషిగా శిక్ష అనుభవిస్తున్న దారా సింగ్ త్వరలో జైలు నుంచి విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది. మంచి ప్రవర్తనను పరిగణనలోకి తీసుకుని ఒడిశా రాష్ట్ర శిక్ష సమీక్ష బోర్డు అతని విడుదలకు సిఫారసు చేసింది. ప్రస్తుతం దారా సింగ్ కియోంజర్ జిల్లా జైలులో ఉన్నాడు. ప్రభుత్వ ఆమోదం లభిస్తే విడుదల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.

### 26 ఏళ్ల జైలు జీవితం

1999 జనవరి 22న జరిగిన ఘటన తర్వాత దారా సింగ్ అరెస్టయ్యాడు. అప్పటి నుంచి వివిధ జైళ్లలో కలిపి 26 సంవత్సరాలకు పైగా శిక్ష అనుభవించాడు. కియోంజర్ జిల్లా అధికారుల నివేదిక ఆధారంగా జైళ్ల డీజీపీ విడుదల ప్రతిపాదనను శిక్ష సమీక్ష బోర్డుకు పంపారు. ఈ నెల తొలి వారంలో జరిగిన సమావేశంలో జీవిత ఖైదీల కేసులను పరిశీలించిన బోర్డు దారా సింగ్ కేసుపై కూడా సానుకూల నిర్ణయం తీసుకుంది.

### దేశాన్ని కుదిపిన హత్య

2025 సెప్టెంబర్‌లో జరిగిన సమావేశంలో దారా సింగ్ కేసును బోర్డు వాయిదా వేసింది. అతని స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఔరయ్య జిల్లా అధికారుల నుంచి తాజా నివేదిక కోరింది. పాత నివేదిక 2022 నాటిదే కావడంతో కొత్త సమాచారం తెప్పించింది. తాజా నివేదికను పరిశీలించిన తర్వాత విడుదలకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. 1999 జనవరి 22 రాత్రి గ్రాహం స్టెయిన్స్ తన ఇద్దరు చిన్న కుమారులు ఫిలిప్, తిమోతితో కలిసి ఒడిశాలోని మనోహర్‌పూర్ గ్రామంలో శిబిరానికి హాజరయ్యాడు. చలికాలం కావడంతో ముగ్గురూ వాహనంలో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో దారా సింగ్ నేతృత్వంలోని గుంపు వాహనానికి బయట నుంచి తాళం వేసి దహన పదార్థం పోసి నిప్పంటించింది. ఈ ఘటనలో ముగ్గురూ సజీవదహనమయ్యారు. ఈ సంఘటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

### మరణశిక్ష నుంచి జీవిత ఖైదు

ఈ ఘటనపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి డి.పీ. వాధ్వా నేతృత్వంలో విచారణ కమిషన్ ఏర్పాటు చేశారు. దర్యాప్తులో గ్రాహం స్టెయిన్స్ బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారనే ఆధారాలు లభించలేదని కమిషన్ పేర్కొంది. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సేవలు అందించే ఆశ్రయ కేంద్రాన్ని ఆయన నిర్వహించారని నివేదిక వెల్లడించింది. కేసులో మొత్తం 51 మందిని అరెస్టు చేశారు. తొలి విచారణలో 37 మంది నిర్దోషులుగా విడుదలయ్యారు. చివరకు దారా సింగ్ సహా 14 మందికి శిక్ష పడింది. తర్వాత హైకోర్టు మరో 11 మందిని నిర్దోషులుగా ప్రకటించింది. దారా సింగ్‌కు ప్రత్యేక సీబీఐ కోర్టు తొలుత మరణశిక్ష విధించింది. తర్వాత ఆ శిక్షను జీవిత ఖైదుగా మార్చారు. కేసులో నిందితుడైన చెంచు హన్స్‌దా అప్పట్లో బాలుడిగా ఉండటంతో అప్పీల్ అనంతరం 2008లో విడుదలయ్యాడు. ఇప్పుడు దారా సింగ్ కూడా విడుదలైతే గ్రాహం స్టెయిన్స్ హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న చివరి ఖైదీ కూడా జైలు నుంచి బయటకు వచ్చినట్లవుతుంది.

## విజయలక్ష్మీపురంలో 'రేషన్' నల్లదందా గుట్టురట్టు

- మొత్తం 26.5 క్వింటాళ్ల బియ్యం, 86 ప్యాకెట్ల చక్కెర స్వాధీనం
- నల్లబజారుకు తరలిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



**చీరాల, జులై 14(నాదేశం) :** పేదల ఆకలి తీర్చాల్సిన రేషన్ బియ్యం నల్లబజారుకు తరలిపోతున్న వైనాన్ని స్థానిక రెవెన్యూ, సివిల్ సప్లైస్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. చీరాల మండలం విజయలక్ష్మీపురంలో రేషన్ బియ్యం భారీగా దారి మళ్లుతోందన్న పక్కా సమాచారంతో ఎన్ఫోర్స్మెంట్ డీటీ ఓంకారేశ్వర రావు సివిల్ సప్లైస్ అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న నెట్‌వర్క్ బట్టబయలైంది. విజయలక్ష్మీపురంలోని ఆవుల శారదకు చెందిన రేషన్ దుకాణం నుంచి ప్రజాపంపిణీ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ఓ వాహనంలో లోడ్ చేస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ వాహనంలో ఉన్న 7.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. అనంతరం రేషన్ దుకాణంలో స్టాక్‌ను తనిఖీ చేయగా రికార్డుల్లో చూపించకుండా బ్లాక్ మార్కెట్ కోసం దాచి ఉంచిన మరో 19 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు, 86 ప్యాకెట్ల చక్కెరను అధికారులు గుర్తించారు. మొత్తం 26.5 క్వింటాళ్ల బియ్యం, 86 ప్యాకెట్లు పంచదారను సీజ్ చేశారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఇస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కార్డుదారులు తమ సొంత అవసరాలకే వాడుకోవాలని, స్వల్ప లాభాల కోసం దళారులకు అమ్మి అక్రమాలకు తావివ్వద్దని డిటి ఓంకారేశ్వర రావు స్పష్టం చేశారు. అలాగే, కార్డుదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి రీసైక్లింగ్ ద్వారా ఎక్కువ ధరకు విక్రయించే డీలర్లు, దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు రేషన్ దుకాణాల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

## ఇంధన భద్రతకు జైశంకర్ గల్ఫ్ దౌత్యం



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల ఖతార్, కువైట్, బహ్రెయిన్, ఒమన్ దేశాల్లో పర్యటించడం వెనుక ప్రధాన లక్ష్యం ఇంధన భద్రతేనని విదేశాంగ శాఖ వెల్లడించింది. చమురు, సహజ వాయువు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూసుకోవడంపై ఆయా దేశాల నాయకులతో విస్తృతంగా చర్చలు జరిగినట్లు అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ప్రాంతీయ భద్రత అంశాలు కూడా సమావేశాల్లో ప్రధానంగా చర్చకు వచ్చాయని చెప్పారు. భారత ఆర్థికాభివృద్ధికి అవసరమైన ఇంధన సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ పర్యటన కీలకంగా ఉపయోగపడుతుందని విదేశాంగ శాఖ పేర్కొంది. గల్ఫ్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించే దిశగా ఈ పర్యటన సానుకూల ఫలితాలను అందించిందని వెల్లడించింది.

## ముద్రగడ పద్మనాభం మృతిపై ప్రముఖుల సంతాప సందేశాలు

### ఎస్. అబ్దుల్ నజీర్ - గవర్నర్:

నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా ప్రజలకు సేవలందించిన నాయకుడిగా గుర్తుచేసి, కుటుంబానికి సానుభూతి తెలిపారు.

### చంద్రబాబు నాయుడు:

ముద్రగడ మరణం తీవ్ర విషాదకరం. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

### వైఎస్ జగన్ మోహన్ రెడ్డి:

పార్టీ సీనియర్ నేత, తండ్రి వంటి వ్యక్తిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కోలుకుని తిరిగి వస్తారని ఆశించిన సమయంలో ఈ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.

### పవన్ కళ్యాణ్ :

ముద్రగడ మరణంపై విచారం వ్యక్తం చేశారు. ఆయన ప్రజాసేవను గుర్తుచేసి, ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

### పీవీఎన్ మాధవ్ :

దశాబ్దాల పాటు ప్రజా సమస్యలపై పోరాడిన నాయకుడిగా కొనియాడారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు.

### రేవంత్ రెడ్డి :

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుండే ప్రజానాయకుడిగా కొనియాడారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మహేష్ కుమార్ గౌడ్

సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ముద్రగడ చేసిన కృషి చిరస్థాయిగా నిలుస్తుందన్నారు.

### కే. చంద్రశేఖర్ రావు :

తెలుగు రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు ముద్రగడ మరణం తీరని లోటన్నారు. కాపు హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన నాయకుడిగా ప్రశంసించారు.

### కేటీఆర్ :

కాపు హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ నాయకుడిని కోల్పోయామని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు ఇది పెద్ద నష్టమన్నారు.

### హరీష్ రావు :

కాపు వర్గ హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా గుర్తుచేశారు. ఆయన ప్రజాసేవ చిరస్మరణీయమన్నారు.

ప్రభాత
కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
బుధవారం 15 జులై 2026
www.prabhathakiranam.com

# పర్యాటకానికి ప్రాధాన్యం... యువతకు కొత్త దిశ

**అధికారులకు అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల ఆదేశాలు**



రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో యువజన పురోభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖల పనితీరును సమీక్షించారు. రాష్ట్రానికి అధిక ఆదాయం వచ్చేలా పర్యాటక రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర సాంస్కృతిక సంపదను సంరక్షిస్తూ భావితరాలకు అందించడం ప్రభుత్వ బాధ్యత అని వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. చారిత్రక కట్టడాలు, కళలు, సంప్రదాయాలను మరింతగా ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సాంస్కృతిక రంగం అభివృద్ధి ద్వారా రాష్ట్ర గుర్తింపును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయాలని చెప్పారు.

యువత సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిటీ స్పష్టం చేసింది. యువతలోని సృజనాత్మకతను వెలికితీసే కార్యక్రమాలు చేపట్టాలని, నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందిస్తే యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో పారదర్శకంగా వినియోగించాలని అధికారులు దృష్టి పెట్టాలని వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు, పర్యాటక అథారిటీ ప్రతినిధులు, సాంస్కృతిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొని శాఖల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

# బస్సు పన్ను తగ్గింపు..

**ప్రైవేట్ బస్సు యజమానుల హర్షం • కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత సభ ఘనంగా జరిగింది. అంతర్రాష్ట్ర టూరిస్ట్ బస్సుల పన్నును రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని అసోసియేషన్ స్వాగతించింది. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ బస్సు అసోసియేషన్ నూతన లోగోను ఆవిష్కరించారు. రవాణా రంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించామని చెప్పారు. బీవోటీ విధానంలో టెర్మినల్స్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పన్ను తగ్గింపు నిర్ణయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, గత ప్రభుత్వాలు చేయలేని పనిని ఆయన సాధించారని అసోసియేషన్ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ నిర్ణయం రవాణా రంగానికి ఊరటనిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.



# భోజ్‌శాల వివాదం

**తాత్కాలిక నమాజ్‌కు అనుమతి**

**సుప్రీంకోర్టు కీలక ఆదేశం**

మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఉన్న భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు వివాదంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరిస్థితిని వెంటనే మార్చబోమని స్పష్టం చేసింది. ఈ అంశం అత్యంత సున్నితమైనదని పేర్కొంటూ ఉద్రిక్తత పెరిగేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని తెలిపింది. కేసుపై త్వరితగతిన రోజువారీ విచారణ చేపట్టి తుది తీర్పు ఇస్తామని ధర్మాసనం వెల్లడించింది. (వివరాలు 3లో..)



# అభివృద్ధికి ఎగిరే రెక్కలు

»ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ
»ఫోకస్ వరంగల్, ఆదిలాబాద్
»అంతర్జాతీయ విమానాశ్రయాలే లక్ష్యం

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో రెండు విమానాశ్రయాల నిర్మాణం, భవిష్యత్ అవసరాలు, మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకమని సీఎం వివరించారు. (వివరాలు 5లో..)

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

**నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్**

**మూడు జిల్లాల్లో అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, విద్యా రంగానికి ఊతమిచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.



# ఇండియాకు చైనా థ్రెట్

- పెరుగుతున్న డ్రాగన్ దిగుమతులు
- భారత్‌కు పెరుగుతున్న సవాలు
- ముప్పుగా మారుతున్న ఆర్థిక లోటు

2026 తొలి ఆరు నెలల్లో చైనా నుంచి భారత్ దిగుమతులు భారీగా పెరిగాయి. ఈ కాలంలో దిగుమతుల విలువ 79.41 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 21.8 శాతం అధికం. ఇదే కాలంలో ఇరు దేశాల మధ్య మొత్తం ద్వైపాక్షిక వాణిజ్యం 91.72 బిలియన్ డాలర్లకు చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే 23.6 శాతం వృద్ధి నమోదైంది. ఇదే ధోరణి కొనసాగితే 2025లో నమోదైన 155.62 బిలియన్ డాలర్ల రికార్డును ఈ ఏడాది అధిగమించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. (వివరాలు 3లో..)



6లో..

# పాక్‌తో పీఓకే తలాక్ తలాక్..

**జనం తిరుగుబాటుతో దాయాది షాక్**

- ఇక చాలు.. మా బతుకు మేం బతుకుతాం
- స్వతంత్ర్యం కోసం పీఓకే ప్రజల పోరాటం
- రగులుతున్న ఆక్రమిత కశ్మీరం
- రక్తంతో రాసిన పాలనపై పోరుబాట
- అణచివేతకు ఎదురొడ్డి ప్రజల పోరాటం

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్.. పీవోకేలో ప్రజల జీవితాలు రోజురోజుకూ దయనీయంగా మారుతున్నాయనే ఆరోపణలు పెరుగుతున్నాయి. తాజాగా కాల్పుల్లో ఆరుగురు కశ్మీరులు మృతి చెందడంతో అక్కడ పోరాటం మరో షేప్ తీసుకుంటోంది. రాజకీయ హక్కుల నిరాకరణ, ప్రజా ఉద్యమాల అణచివేత, భద్రతా బలగాల కాల్పులు, భారీ అరెస్టులు, ఇంటర్నెట్ ఆంక్షలు, ఆహారం-మందుల కొరత వంటి సమస్యలు అక్కడి ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టినట్లు అనేక నివేదికలు, స్థానిక వర్గాల ఆరోపణలు సూచిస్తున్నాయి. ప్రజల డిమాండ్లకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వం బలప్రయోగంతో స్పందిస్తోందని ఉద్యమకారులు విమర్శిస్తున్నారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, మౌలిక హక్కుల కోసం ప్రజలు వీధుల్లోకి వస్తుండగా, ప్రతి నిరసనను అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో పీవోకే అంశం అంతర్జాతీయ స్థాయిలో కూడా చర్చకు వస్తోంది. పాకిస్తాన్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, కొనసాగుతున్న నిరసనలు, మానవతా పరిస్థితులు, భారత్ స్పందన, భవిష్యత్ రాజకీయ ప్రభావాలపై ప్రత్యేక కథనాలు నా దేశం స్పెషల్‌లో



# భక్తులే ముఖ్యం

**బోనాల భద్రతపై ఉక్కుపాదం**

**పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాట్లు**

**సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు**

ఆషాఢ బోనాల ఉత్సవాలను శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. బోనాల ప్రారంభ 15 రోజులు అత్యంత కీలకమని పేర్కొంటూ ప్రతి అధికారి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. (వివరాలు 5లో..)

# డబ్బే డబ్బు..



- 100 కోట్ల అక్రమాస్తులు • సీఈ బచ్చు రవీందర్ అరెస్ట్
- 12 చోట్ల ఏకకాలంలో సోదాలు
- హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్‌కి ఏసీబీ ఉచ్చు

హైదరాబాద్‌లో మరోసారి ఏసీబీ సోదాలు సంచలనం సృష్టించాయి. హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు కావడంతో అధికారులు ఆయన నివాసం, కార్యాలయాలతో పాటు హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో మొత్తం 12 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సోదాల్లో కీలక పత్రాలు, ఆస్తులకు సంబంధించిన ఆధారాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం బచ్చు రవీందర్‌ను ఏసీబీ అరెస్ట్ చేసింది. (వివరాలు 5లో..)



# మంచం కింద నోట్ల కట్టలు

**రూ.2 లక్షల లంచం • రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత**

**పెద్దపల్లి ఏఈకు ఏసీబీ షాక్ • ఇంట్లో రూ.32 లక్షల నగదు**

పెద్దపల్లి జిల్లా మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్ కల్లెపల్లి సతీష్ కుమార్ ఏసీబీ వలకు చిక్కాడు. ఎంబీ రికార్డు నమోదు చేసి బిల్లులు ప్రాసెస్ చేయడానికి కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. భారీ మొత్తం అడగడంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం కాంట్రాక్టర్ లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు సతీష్ కుమార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.

# జర సోచో..

»ఓటు హక్కు కాపాడుకోండి
»డాక్యుమెంట్స్ ఇవ్వనోళ్లు
»కోటి 71 లక్షల 55 వేల 838
»ఫారాలు సమర్పిస్తేనే ఓటు హక్కు
»ఓటర్లకు సీఈఓ కీలక విజ్ఞప్తి
»చివరి దశకు ఎన్యూమరేషన్




జర సోచో... మీ పేరు ఓటరు జాబితాలో అలాగే కొనసాగాలంటే తక్షణం స్పందించాల్సిన సమయం వచ్చింది. తెలంగాణలో ఇంకా 1,71,55,838 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాల్సి ఉంది. ఫారం పూర్తి చేసి అవసరమైన వివరాలు బీఎల్ఓకు అందజేస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదవుతుంది. మరో పది రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనున్న నేపథ్యంలో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు కావడంతో చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే ఫారాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. (వివరాలు 5లో..)

# నష్టాల పాపం బీఆర్ఎస్, కాంగ్రెస్‌దే

**సింగరేణి బకాయిలపై కిషన్ రెడ్డి ఫైర్**

సింగరేణి భరోసా యాత్రలో భాగంగా రామగుండం, తాడిచెర్ల, మంచిర్యాలలో జరిగిన కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సింగరేణి పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి తెలంగాణకు ఆస్తి మాత్రమే కాదని, లక్షల కుటుంబాలకు జీవనాధారమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశానికి బొగ్గు సరఫరా చేస్తూ దేశ విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థను బలోపేతం చేయడం అత్యవసరమని చెప్పారు.


2లో..

# ఓటరు సవరణకు గడువు పెంచండి

**హైదరాబాద్‌లో నత్తనడక ప్రక్రియ • సీఈసీకి పొన్నం, కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి**



తెలంగాణలో ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు గడువు పెంచాలని కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ జిల్లాలో ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదని వారు వివరించారు. (వివరాలు 5లో..)

# కొత్త పెట్రోల్.. చేతికి చమురు

**ఈ20 ఇంధనంపై విమర్శలు..**

**ఇథనాల్ విమర్శలు-కేంద్రం క్లారిటీ**

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ20) పై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి వివరణ ఇచ్చింది. ఇథనాల్ కలపడం వల్ల మైలేజ్ తగ్గుతుందా? పర్యావరణానికి ఎంత ఉపయోగం? ముడి చమురు ధరలు తగ్గినా పెట్రోల్ ధరలు ఎందుకు తగ్గడం లేదు? వంటి ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు విడుదల చేసింది. ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేయడమే లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. (వివరాలు 3లో..)




# ఫ్యామిలీతో కలిసి సర్

**ఓటరు సవరణలో కేటీఆర్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (సర్)లో పాల్గొన్నారు. మంగళవారం తన ఓటరు వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో పూర్తి చేసి సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేశారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా చురుకుగా పాల్గొంటున్నారు. కేటీఆర్‌తో పాటు ఆయన సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు కూడా ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఎన్నికల అధికారులకు అందజేశారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.



# అభివృద్ధికి ఎగిరే రెక్కలు
## ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ బిజీ



- ఫోకస్ వరంగల్, ఆదిలాబాద్
- అంతర్జాతీయ విమానాశ్రయాలే లక్ష్యం

తెలంగాణలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో రెండు విమానాశ్రయాల నిర్మాణం, భవిష్యత్ అవసరాలు, మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకమని సీఎం వివరించారు.

**వరంగల్‌కు ప్రత్యేక గుర్తింపు**

వరంగల్ నగరం రైలు, రోడ్డు మార్గాల అనుసంధానం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, పారిశ్రామిక అవకాశాలతో వేగంగా ఎదుగుతోందని సీఎం తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న వరంగల్ భవిష్యత్‌లో మరింత కీలక నగరంగా మారుతుందని చెప్పారు. అందుకే విమానాశ్రయాన్ని సాధారణ స్థాయిలో కాకుండా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. 2028 జూన్ 2 నాటికి విమానాశ్రయాన్ని ప్రారంభించేలా కార్యాచరణ చేపట్టాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. వరంగల్‌కు ఉన్న చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా విమానాశ్రయ డిజైన్ రూపొందించాలని సీఎం సూచించారు. కాకతీయుల శిల్పకళ, సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిఫలించే నిర్మాణ శైలి ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించారు.

**ఆదిలాబాద్‌కు కొత్త అవకాశాలు**

ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని విమానాశ్రయంతో పాటు పౌర విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి అందజేస్తుందని హామీ ఇచ్చారు. అక్కడ కూడా ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. మరోవైపు హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీ ప్లేన్ సేవలు ప్రారంభించే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు పంపాలని కేంద్ర మంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాజెక్టు పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకురావచ్చని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**అభివృద్ధికి రాజకీయాలు అడ్డుకావొద్దు**

సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి అంశాలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు. ఎన్నికల సమయానికే రాజకీయాలు పరిమితం కావాలని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై కేంద్రంతో చర్చిస్తూ సహకారం పొందుతున్నామని తెలిపారు. విమానాశ్రయాల విస్తరణ ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు పెరుగుతాయని చెప్పారు.

**తెలంగాణకు కేంద్రం ప్రశంసలు**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలంగాణ ప్రభుత్వం వేగంగా భూ సేకరణ పూర్తి చేయడాన్ని అభినందించారు. దేశంలోని చాలా రాష్ట్రాలు విమానాశ్రయాల కోసం పోటీపడుతున్న సమయంలో తెలంగాణ చూపిన చొరవ ఆదర్శంగా నిలిచిందన్నారు. వరంగల్ విమానాశ్రయం కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా రూపుదిద్దుకుంటుందని స్పష్టం చేశారు. ఈ రెండు విమానాశ్రయాలు తెలంగాణ అభివృద్ధికి కొత్త దిశను చూపే కీలక ప్రాజెక్టులుగా మారనున్నాయని పేర్కొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్



- నేడు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్
- మూడు జిల్లాల్లో అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, విద్యా రంగానికి ఊతమిచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

**ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్**

మధ్యాహ్నం 12 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం రేవంత్ రెడ్డి, 12:15 గంటలకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి చేరుకుంటారు. అక్కడ అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు కీలక అడుగుగా భావిస్తున్నారు.

**దివిటిపల్లిలో అమరరాజా ప్లాంట్ ప్రారంభం**

ఫ్యూచర్ సిటీ కార్యక్రమం అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి చేరుకుని అమరరాజా సెల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ప్లాంట్‌ను సందర్శించి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించి పారిశ్రామికాభివృద్ధిపై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

**విద్యా రంగానికి మరో అడుగు**

మధ్యాహ్నం తర్వాత వనపర్తి జిల్లా కొత్తకోటకు చేరుకుని బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారు. సీఎం పర్యటనతో పరిశ్రమలు, సాంకేతిక రంగం, విద్యా రంగానికి కొత్త ఉత్సాహం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# జర సోచో..



- ఓటు హక్కు కాపాడుకోండి
- డాక్యుమెంట్స్ ఇవ్వనోళ్లు
- కోటి 71 లక్షల 55 వేల 838
- ఫారాలు సమర్పిస్తేనే ఓటు హక్కు
- ఓటర్లకు సీఈఓ కీలక విజ్ఞప్తి
- చివరి దశకు ఎన్యూమరేషన్

తెలంగాణలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే పూర్తి చేసి బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. విలువైన ఓటు హక్కును కాపాడుకోవాలంటే ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

**తప్పులు లేకుండా వివరాలు నమోదు**

ఎన్యూమరేషన్ ఫారంలో అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సీఈఓ తెలిపారు. ఫోటో అతికించి, ఓటరు సంతకం, తేదీ నమోదు చేయాలని సూచించారు. బీఎల్ఓ సంతకం కూడా తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. బీఎల్ఓ ఇచ్చిన రెండు ఫారాల్లో ఒకటి తిరిగి అధికారికి ఇవ్వాలి. మరో ప్రతిని ఓటరు భద్రంగా ఉంచుకోవాలని వివరించారు. పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాన్ని బీఎల్ఓకు అందజేస్తేనే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు అవుతుందని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో వివరాలు ఉన్నవారు వాటి ఆధారంగా ఫారం నింపాలని సూచించారు. పాత వివరాలు లేకపోతే ప్రస్తుత సమాచారంతోనే ఫారం పూర్తి చేసి సమర్పించాలని తెలిపారు.

**మరో పది రోజులు మాత్రమే**

రాష్ట్రవ్యాప్తంగా 3,38,26,448 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610 మంది తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించినట్లు సీఈఓ వెల్లడించారు. జూన్ 25న ప్రారంభమైన ఈ ప్రక్రియ మరో పది రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన ప్రతి ఓటరు ఆలస్యం చేయకుండా ఫారాలను బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. సమయానికి ఫారం సమర్పిస్తేనే ఓటు హక్కు రక్షితంగా ఉంటుందని స్పష్టం చేశారు.

# నష్టాల పాపం బీఆర్ఎస్, కాంగ్రెస్‌దే

**సింగరేణి బకాయిలపై కిషన్ రెడ్డి ఫైర్**




సింగరేణి భరోసా యాత్రలో భాగంగా రామగుండం, తాడిచెర్ల, మంచిర్యాలలో జరిగిన కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సింగరేణి పరిరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. సింగరేణి తెలంగాణకు ఆస్తి మాత్రమే కాదని, లక్షల కుటుంబాలకు జీవనాధారమని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశానికి బొగ్గు సరఫరా చేస్తూ దేశ విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థను బలోపేతం చేయడం అత్యవసరమని చెప్పారు.

**బకాయిలే సంక్షోభానికి కారణం**

సింగరేణి ఆర్థిక ఇబ్బందులకు ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలేనని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ జెన్‌కోకు సరఫరా చేసిన బొగ్గుకు సంబంధించిన సుమారు రూ.18 వేల కోట్లు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన మరో రూ.6 వేల కోట్లు సహా మొత్తం రూ.27 వేల కోట్ల మేర నిధులు రావాల్సి ఉన్నాయని తెలిపారు. ఈ డబ్బు కార్మికుల చెమట ఫలమని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 350 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలున్న ఈ కోల్ బ్లాక్ ద్వారా 40 నుంచి 50 సంవత్సరాల పాటు ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనిని "బాహుబలి కోల్ బ్లాక్"గా అభివర్ణించారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై విమర్శలు**

తాడిచెర్ల-2 ప్రాజెక్టు ద్వారా సుమారు 2,000 శాశ్వత ఉద్యోగాలు, 5,000కు పైగా కాంట్రాక్టు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. రవాణా, హోటళ్లు, లాజిస్టిక్స్, వర్క్‌షాప్‌లు, చిన్న వ్యాపారాల్లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో ఉత్తర తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త కోల్ బ్లాక్‌లు తీసుకురాలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. రెండు ప్రభుత్వాల వైఖరి వల్ల సింగరేణి అప్పుల ఊబిలో పడిందన్నారు. జీతాల కోసం కూడా అప్పులు తీసుకునే పరిస్థితి రావడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

**'సేవ్ సింగరేణి' నినాదం**

సింగరేణిని బలోపేతం చేయడం అంటే తెలంగాణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంస్థ భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ప్రజలు, కార్మికులు కలిసి "సేవ్ సింగరేణి - యునైట్ సింగరేణి" నినాదంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# భక్తులే ముఖ్యం



- బోనాల భద్రతపై ఉక్కుపాదం
- పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాట్లు
- సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

**నెలరోజుల ప్రత్యేక భద్రత**

జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాల వద్ద అదనపు నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. టాస్క్ ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్డ్ రిజర్వ్, క్విక్ రియాక్షన్ బృందాలను భారీగా మోహరించనున్నట్లు వెల్లడించారు. మహిళా భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని సీపీ తెలిపారు. షీ టీమ్స్ నిరంతరం నిఘా నిర్వహిస్తాయని చెప్పారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత బోనాల సమయంలో 644 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

**భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు**

బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ప్రదర్శనల సందర్భంగా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఉంటుందని సజ్జనార్ తెలిపారు. ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైన సమాచారం అందించనున్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రతి భక్తుడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పండుగను ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని సీపీ స్పష్టం చేశారు.

# ఓటరు సవరణకు గడువు పెంచండి

- హైదరాబాద్‌లో నత్తనడక ప్రక్రియ
- సీఈఓకి పొన్నం, కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి

తెలంగాణలో ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు గడువు పెంచాలని కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ జిల్లాలో ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదని వారు వివరించారు.

**21 శాతానికే పరిమితమైన నమోదు**

హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు సవరణ ప్రక్రియ చాలా నెమ్మదిగా కొనసాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటివరకు సగటున 21 శాతం మాత్రమే పూర్తైందని చెప్పారు. ఇంకా పది రోజుల గడువు మాత్రమే మిగిలి ఉండటంతో అర్హులైన ఓటర్లందరికీ అవకాశం కల్పించేందుకు గడువు పొడిగించాలని కోరినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో సుమారు 4,500 పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**బీఎల్‌వోల పనితీరుపై ఫిర్యాదులు**

క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఇళ్లకు వెళ్లడం లేదని, దరఖాస్తు ఫారాలు సక్రమంగా అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారాన్ని తీసుకుంటే నమోదు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని సూచించారు. బీఎల్‌వోలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**అర్హుల ఓటు కోల్పోకూడదు**

అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా జాబితా నుంచి మిస్ కాకూడదని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలని అన్నారు. ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలపై ప్రభావం ఉంటుందనే ప్రచారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అందుకే మరింత సమయం ఇచ్చి ఓటరు సవరణ ప్రక్రియను పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్లతో సోషల్ మీడియాలో సందడి

**హోం టూర్ వీడియోలపై పొంగులేటి హ్యాపీ**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తమ సొంతింటి ఆనందాన్ని యూట్యూబ్ సహా సోషల్ మీడియా వేదికల్లో పంచుకోవడం సంతోషకరమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తొలి దశలో 4.5 లక్షలు, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లతో పాటు దశలవారీగా ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా హామీలకే పరిమితం కాకుండా ఇళ్లు నిర్మించి అందిస్తున్నామని, లబ్ధిదారుల హోం టూర్ వీడియోలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. పేదల చిరునవ్వులే తమ ప్రభుత్వానికి అతిపెద్ద పురస్కారమని మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు.

# డబ్బే డబ్బు..





- 100 కోట్ల అక్రమాస్తులు
- సీఈ బచ్చు రవీందర్ అరెస్ట్
- 12 చోట్ల ఏకకాలంలో సోదాలు
- హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్‌కి ఏసీబీ ఉచ్చు

భారీ స్థిరాస్తులు గుర్తింపు

సోదాల్లో బచ్చు రవీందర్ పేరిట ఉన్న భారీ స్థిరాస్తులు వెలుగులోకి వచ్చాయి. సుమధుర అక్రోపోలిస్‌లో మూడు ఫ్లాట్లు, శ్రీవారి మెడోస్‌లో ఒక ఫ్లాట్, వాసవి అట్లాంటిస్‌లో మూడు ఫ్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మసీద్‌బండలో నాలుగు అంతస్తుల భవనం, కొండాపూర్‌లో రెండు ఫ్లాట్లు, జడ్చర్లలో ఏడు ఓపెన్ ప్లాట్లు, శంషాబాద్, షాబాద్ పరిధిలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు నిర్ధారించారు. శంకర్‌పల్లి, కిష్టాపూర్ ప్రాంతాల్లో కూడా భూములు ఉన్నట్లు విచారణలో తేలింది.

**బంగారం, నగదు, లాకర్లు సీజ్**

రవీందర్ నివాసంలో నిర్వహించిన సోదాల్లో అర కిలోకు పైగా బంగారం, కిలో వెండి, రూ.4 లక్షల నగదు, సుమారు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయన పేరిట ఉన్న నాలుగు బ్యాంక్ లాకర్లను గుర్తించి ఫ్రీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువపై పూర్తి లెక్కలు సిద్ధం చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తును మరింత వేగవంతం చేసింది. ఆస్తుల కొనుగోలు వివరాలు, నిధుల మూలాలు, బ్యాంకు లావాదేవీలను అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే మరికొందరిని కూడా విచారించే అవకాశం ఉందని సమాచారం. ఈ సోదాలు మరోసారి అవినీతి ఆరోపణలపై ఏసీబీ కఠిన వైఖరిని స్పష్టం చేశాయి.

# మంచం కింద నోట్ల కట్టలు

- రూ.2 లక్షల లంచం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- పెద్దపల్లి ఏఈకు ఏసీబీ షాక్
- ఇంట్లో రూ.32 లక్షల నగదు

బిల్లుల ఆమోదానికి లంచం డిమాండ్

తెనుగువాడ హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు, కునారం రోడ్డులోని శ్మశానవాటిక అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.12.28 లక్షల బిల్లును ప్రాసెస్ చేసి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పంపేందుకు సతీష్ కుమార్ లంచం కోరినట్లు ఏసీబీ వెల్లడించింది. ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు ఉచ్చుపన్ని నిందితుడిని పట్టుకున్నారు. అరెస్టు అనంతరం సతీష్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మంచం కింద లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదు లభించింది. నగదును అధికారులు స్వాధీనం చేసుకుని దానికి సంబంధించిన ఆధారాలను సేకరించారు. ఈ నగదు మూలాలపై కూడా ప్రత్యేకంగా విచారణ చేపట్టారు.

**ప్రత్యేక కోర్టుకు తరలింపు**

నిందితుడిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కరీంనగర్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచేందుకు తరలించారు. ఈ కేసులో మరిన్ని ఆర్థిక లావాదేవీలు, అక్రమ ఆస్తుల కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ స్పష్టం చేసింది. ఈ ఘటనతో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ఏసీబీ మరోసారి కఠిన చర్యలు చేపట్టిందనే సంకేతాలు వెలువడ్డాయి.

# ఊరూరా బీఆర్ఎస్ కుట్రలపై ప్రచారం




- కాళేశ్వరం కూలింది అప్పుడే కదా!
- మాపై విమర్శలెందుకన్న పొన్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ పాలనే కారణమని ఆరోపించారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక, కేంద్ర నిపుణుల సూచనల మేరకే ప్రాజెక్టులో నీటిని నింపుతామని స్పష్టం చేశారు. ఇంజినీర్లు సూచించిన చర్యలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కరవు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలను రెచ్చగొట్టకుండా ప్రతిపక్షం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కాళేశ్వరం అంశంపై రాజకీయాలు చేయకుండా నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు వివరిస్తామని కూడా వెల్లడించారు.




## పాక్ అణచివేత.. కశ్మీరీల తిరుగుబాటు

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఎన్నో దశాబ్దాలుగా రాజకీయ అణచివేత, ఆర్థిక నిర్లక్ష్యం, ప్రాథమిక హక్కుల ఉల్లంఘన ఆరోపణల మధ్య జీవిస్తున్న ప్రజలు ఇప్పుడు బహిరంగంగా స్వేచ్ఛ కోసం గొంతెత్తుతున్నారు. ఒకప్పుడు విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, ఉపాధి సమస్యలతో ప్రారంభమైన ప్రజా ఉద్యమం ఇప్పుడు పాకిస్తాన్ పాలనను ప్రశ్నించే స్థాయికి చేరుకుంది. కాల్పులు, అరెస్టులు, ఇంటర్నెట్ నిలిపివేత, ఆహారం–మందుల సరఫరాపై ఆంక్షల ఆరోపణలతో ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగింది. రావలాకోట్, ముజఫరాబాద్ వంటి ప్రాంతాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ఉద్యమం రాజకీయ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులు, ఆర్థిక న్యాయం కోరుతూ ముందుకు సాగుతోంది. ఇదే సమయంలో కొందరు స్థానిక నాయకులు భారత్ నుంచి మానవతా సహాయం కోరడం, నియంత్రణ రేఖ తెరవాలని డిమాండ్ చేయడం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. మరోవైపు పీవోకే భారతదేశంలో అంతర్భాగమేనని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాలన్నీ కశ్మీర్ అంశాన్ని కొత్త రాజకీయ మలుపు వైపు తీసుకెళ్తున్నాయి. ఈ ప్రత్యేక కథనంలో పీవోకేలో తాజా పరిణామాలు, ప్రజా ఉద్యమం, పాకిస్తాన్ చర్యలు, భారత్ స్పందన, భవిష్యత్ ప్రభావాలపై ఐదు ప్రత్యేక కథనాలను వరుసగా అందిస్తున్నాం.



## పాక్ కాల్పుల మోత.. పీవోకేలో రక్తపాతం

» కశ్మీరీల రక్తం తాగుతున్న పాక్ పాలకులు
» ఆరుగురు బలి అమయాకులు మృత్యువాత

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రావలాకోట్ నగరంలోని న్యూ బస్ టెర్మినల్ సమీపంలో స్థానికులపై పాకిస్థాన్ భద్రతా బలగాలు చేపట్టిన చర్యలు హింసాత్మక ఘర్షణలకు దారితీశాయి. ఈ ఘటనలో భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. తాజా ఘటనతో ఇప్పటికే అసంతృప్తితో ఉన్న ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగింది.

**• వైట్ హౌస్ ముందు నిరసన**

బలోచ్ సధునాటి జిల్లాకు చెందిన జాహిద్ ముఘల్, జఫర్ ముఘల్, అర్సలాన్ అక్బర్ కాల్పుల్లో మృతిచెందారు. రావలాకోట్‌లోని మాటియల్ మీరా బస్ టెర్మినల్ వద్ద వాజిద్ హయత్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. మరికొంతమంది గాయపడినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి. బాధిత కుటుంబాలు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.
ఈ రక్తపాతానికి ఒక్క రోజు ముందే అమెరికాలోని వాషింగ్టన్‌లో వైట్ హౌస్ ఎదుట పీవోకేకు చెందిన ప్రవాసులు భారీ నిరసన చేపట్టారు. మహిళలు, చిన్నారులు, సామాజిక నాయకులు కలిపి దాదాపు వంద మంది పాల్గొన్నారు. పౌర ప్రాంతాల నుంచి పాకిస్థాన్ సైన్యాన్ని వెంటనే వెనక్కి పంపాలని వారు డిమాండ్ చేశారు. నిరాయుధ ప్రజలపై ప్రాణాంతక బలప్రయోగాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

**• ఆహారం కూడా కరవే**

పీఓకే ప్రజలు తీవ్ర ఆర్థిక కష్టాలతో జీవిస్తున్నారు. 2025లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం దాదాపు 66 శాతం మంది వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడుతున్నారు. అయినప్పటికీ 57 శాతం కుటుంబాలు ఆహార భద్రత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సుమారు 29 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. కొండ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రమై, దాదాపు 90 శాతం కుటుంబాలు ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు అధ్యయనం వెల్లడించింది. ఆరోగ్య పరిస్థితులు కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఐదేళ్లలోపు చిన్నారుల్లో 39 శాతం మంది ఎదుగుదల లోపంతో బాధపడుతున్నట్లు అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. లక్ష ప్రసవాలకు 104 మంది తల్లులు మరణిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఇంటర్నెట్ నిలిపివేత కారణంగా దాదాపు 40 లక్షల మంది బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**• భారత్ తీవ్ర విమర్శలు**

పీవోకేలో జరుగుతున్న పరిణామాలపై భారత్ తీవ్రంగా స్పందించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న దోపిడీ, ప్రాథమిక హక్కుల నిరాకరణ, పరిపాలనా అణచివేత ఫలితంగానే ఈ నిరసనలు ఉద్భవించాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే బదులు ఆహారం, మందుల సరఫరాను అడ్డుకోవడం, ఇంటర్నెట్ నిలిపివేయడం, మహిళలు, చిన్నారులపై బలప్రయోగం చేయడం అత్యంత ఆందోళనకరమని ఆయన విమర్శించారు. నిరాయుధ పౌరులపై జరిగిన ఈ చర్యలకు పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా నిలపాలని భారత్ కోరింది.

## పీవోకేలో ప్రజా ఉద్యమం

• 38 డిమాండ్ల హెచ్చరికలు
• అల్టిమేటంతో రాజకీయ వేడి



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్... పీవోకేలో రాజకీయ ఉద్రిక్తత మరోసారి తారాస్థాయికి చేరుతోంది. జమ్మూ కశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ... జేఏఏసీ ఇస్లామాబాద్ ప్రభుత్వానికి తమ 38 డిమాండ్లను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేస్తోంది. లేకపోతే ఇప్పటివరకు చూడని స్థాయిలో తుది దశ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించింది. జూలై 27న జరగనున్న ప్రాంతీయ ఎన్నికల ముందు ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.
వివాదానికి కేంద్రంగా 12 స్థానాలు
జేఏఏసీ ప్రధాన డిమాండ్ శరణార్థుల కోసం కేటాయించిన 12 శాసనసభ స్థానాలను రద్దు చేయడమే. ఈ స్థానాల కారణంగా ఇస్లామాబాద్ ప్రభావం పీవోకే రాజకీయాలపై అధికంగా కొనసాగుతోందని సంస్థ ఆరోపిస్తోంది. పాకిస్థాన్‌లో స్థిరపడిన సుమారు 4.36 లక్షల నమోదిత ఓటర్లకు ఈ 12 స్థానాలు ఉండగా, పీవోకేలో నివసిస్తున్న దాదాపు 33 లక్షల ప్రజలకు కేవలం 33 ప్రత్యక్ష స్థానాలే ఉన్నాయి. ఈ అసమానత ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని స్థానికులు వాదిస్తున్నారు.

**సుప్రీంకోర్టు తీర్పుతో కొత్త మలుపు**

జూన్ 7న పీవోకే సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. శరణార్థుల కోసం కేటాయించిన 12 స్థానాలను సాధారణ ప్రభుత్వ ఉత్తర్వుతో రద్దు చేయలేమని స్పష్టం చేసింది. రాజ్యాంగ సవరణ ద్వారానే ఆ మార్పు సాధ్యమని వెల్లడించింది. దీంతో ఈ వివాదం మరింత సంక్లిష్టంగా మారింది.

**ఆర్థిక ఇబ్బందులే అసలు కారణం**

38 డిమాండ్లలో రాజకీయ అంశాలే కాదు, ప్రజల జీవన సమస్యలూ ఉన్నాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులపై కొత్త ఒప్పందాలు చేయాలని జేఏఏసీ కోరుతోంది. పిండి వంటి నిత్యావసర వస్తువులపై అధిక సబ్సిడీలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌కే ప్రజలు భారీ బిల్లులు చెల్లించడం అన్యాయమని పేర్కొంది. విద్యుత్ చార్జీలు తగ్గించాలని కూడా డిమాండ్ చేసింది.

**సంపద ఉన్నా అభివృద్ధి లేదు**

పీవోకే ప్రకృతి సంపదకు నిలయం. అడవులు, గ్రాఫైట్, పాలరాయి, విలువైన రత్నాలు, విస్తారమైన జలవనరులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. పాకిస్థాన్ వ్యవసాయానికి అవసరమైన నీటిలో పెద్ద భాగం ఇక్కడి నదుల నుంచే వెళ్తోంది. దేశ విద్యుత్ ఉత్పత్తిలో కూడా ఈ ప్రాంతం కీలక పాత్ర పోషిస్తోంది. అయినా స్థానికులకు తగిన అభివృద్ధి ఫలాలు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదాయం పాకిస్థాన్‌కు వెళ్తోందే తప్ప స్థానిక మౌలిక సదుపాయాలు మాత్రం వెనుకబడి ఉన్నాయని విమర్శిస్తున్నారు.

**ప్రజల జీవితం కష్టాల్లోనే**

2025లో వెలువడిన అధ్యయనం ప్రకారం పీవోకేలో 66 శాతం మంది వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడుతున్నారు. అయినప్పటికీ 57 శాతం కుటుంబాలు ఆహార భద్రత సమస్యను ఎదుర్కొంటున్నాయి. దాదాపు 29 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. కొండ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడ 90 శాతం కుటుంబాలు ఆహార కొరతను ఎదుర్కొంటున్నట్లు అధ్యయనం తెలిపింది. ఐదేళ్లలోపు చిన్నారుల్లో 39 శాతం ఎదుగుదల లోపంతో బాధపడుతుండగా, లక్ష ప్రసవాలకు 104 మంది తల్లులు మరణిస్తున్నట్లు నివేదికలు వెల్లడించాయి.





**అరెస్టులు.. భద్రతా ఉద్రిక్తత**

రాజకీయ కార్యకర్త అమ్జద్ మీర్జా ఆరోపణల ప్రకారం 600 మందికి పైగా ఉద్యమకారులను అరెస్టు చేశారు. 100 మందికిపైగా నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన పేర్కొన్నారు. మరోవైపు 2024 నవంబర్ నుంచి 2026 ఏప్రిల్ వరకు 39 భద్రతా ఘటనలు నమోదయ్యాయని యూరోపియన్ యూనియన్ ఏజెన్సీ నివేదిక వెల్లడించింది. ఆయుధ ఘర్షణలు, పేలుళ్లలో పలువురు మరణించారు.

**మొదట్నుంచి భారత్ ఒకే వైఖరి**

పీవోకే భారతదేశ అంతర్భాగమేనని భారత్ మరోసారి స్పష్టం చేసింది. 1947 అక్టోబర్ 26న మహారాజా హరి సింగ్ భారతదేశంలో విలీన ఒప్పందంపై సంతకం చేసిన విషయం చట్టబద్ధమని భారత్ చెబుతోంది. 1994లో భారత పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించి పాకిస్థాన్ ఆక్రమిత ప్రాంతాలను ఖాళీ చేయాలని కోరాయి. ఇప్పుడు ఎన్నికల వేళ జేఏఏసీ హెచ్చరికలతో పీవోకే మరో పెద్ద రాజకీయ ఘర్షణ దిశగా అడుగులు వేస్తోంది.

## కశ్మీరీల చూపు భారత్ వైపు

• పాక్ దౌర్జన్యాలతో విలవిల..
• సాయం కోరుతున్న పీవోకే

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పరిస్థితులు రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ అణచివేత చర్యలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న నిరసనలు ఇప్పుడు పాకిస్తాన్ పాలనకు వ్యతిరేక ఉద్యమంగా మారాయి. ఆహారం, మందుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారిగా భారత్ నుంచి మానవతా సహాయం అందించాలని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు.
"భారత్ మాకు అండగా నిలవాలి"
జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ... జేఏఏసీ నాయకుడు సర్దార్ అమన్ ఖాన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భారత్ సాయం అవసరమని ప్రకటించారు. "మాకు ఆహారం కావాలి... మందులు కావాలి... భారత్ మాకు సహాయం చేయాలి" అంటూ విజ్ఞప్తి చేశారు. పాకిస్తాన్ భద్రతా బలగాల చర్యల వల్ల ప్రాంతంలో మానవతా సంక్షోభం నెలకొన్నదని ఆరోపించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తక్షణ సహాయం అందించాలని కోరారు.

**• ఎల్‌వోసీ తెరవాలంటూ డిమాండ్**

రావలాకోట్‌లో నిర్వహించిన భారీ సభలో అమన్ ఖాన్ కీలక డిమాండ్ చేశారు. పూంచ్, దోడా సెక్టార్ల వద్ద నియంత్రణ రేఖను తెరవాలని కోరారు. పరిస్థితులు మరింత దిగజారితే ప్రజలకు భారత్ వైపు వెళ్లే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలపై బుల్లెట్లతో సమాధానం ఇస్తే తమ వద్ద కూడా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని హెచ్చరించారు. ఇటీవల రావలాకోట్‌లోని ఈద్గా మైదానంలో జరిగిన భారీ నిరసనలో వేలాది మంది పాల్గొన్నారు. "పీవోకే పాకిస్తాన్‌లో భాగం కాదు", "మాకు స్వేచ్ఛ కావాలి" అంటూ నినాదాలు చేశారు. తొలుత ఆర్థిక సమస్యలు, సంస్కరణల కోసం ప్రారంభమైన ఉద్యమం ఇప్పుడు పాకిస్తాన్ పాలనకు వ్యతిరేక స్వాతంత్ర్య డిమాండ్‌గా మారిందని పరిశీలకులు చెబుతున్నారు.

**• జేఏఏసీపై నిషేధం**

జూన్ 5న జేఏఏసీ సంస్థను పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాద సంస్థగా ప్రకటించి నిషేధించింది. ఆ తర్వాత భద్రతా బలగాలను భారీగా మోహరించి ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేసింది. కాల్పులు, అరెస్టులు, ఆంక్షలతో పరిస్థితి మరింత దిగజారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాకిస్తాన్ ప్రధాన రాజకీయ పార్టీల ఆధిపత్యం కారణంగా స్థానిక ప్రజలకు స్వేచ్ఛ దక్కడం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజా పరిణామాలతో పీవోకేలోని రాజకీయ, మానవతా పరిస్థితులు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. పాకిస్తాన్ అణచివేతపై ప్రపంచ దేశాలు స్పందించాలని స్థానిక నాయకులు కోరుతున్నారు. ముఖ్యంగా భారత్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆహారం, మందులు అందించడంతో పాటు ఎల్‌వోసీ ద్వారా సహాయాన్ని అనుమతించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పీవోకే ప్రజలు బహిరంగంగా భారత్ సాయం కోరడం అక్కడి సంక్షోభం ఎంత తీవ్రమైందో స్పష్టం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## పీవోకే పాకిస్తాన్‌ది కాదు

▪ భారత్ వైపు చూస్తున్న ప్రజలు
▪ ఇస్లామాబాద్‌కు హెచ్చరిక

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు మరింత ఉధృతమవుతున్నాయి. రావలాకోట్‌లోని ఈద్గా మైదానంలో జరిగిన భారీ సభలో పాకిస్తాన్ పాలనను అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. "పీవోకే పాకిస్తాన్‌లో భాగం కాదు", "మాకు స్వేచ్ఛ కావాలి" అంటూ నినాదాలు చేశారు. స్థానిక ప్రజల ఆగ్రహం ఇప్పుడు రాజకీయ ఉద్యమంగా మారిందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**• భారత్‌తో సంబంధాలే మార్గమంటూ వ్యాఖ్యలు**

నిరసన సభలో పలువురు నాయకులు కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకే ప్రజలు ఇకపై భారత్‌తో సన్నిహిత సంబంధాలు కోరుకునే పరిస్థితి వస్తోందని హెచ్చరించారు. ప్రజల సమస్యలను పాకిస్తాన్ ప్రభుత్వం పట్టించుకోకపోతే భారత్ నుంచి మానవతా సహాయం కోరడం తప్ప మరో మార్గం ఉండదని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు పాకిస్తాన్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకుడు సర్దార్ అమన్ ఖాన్ నిరసన సభలో మాట్లాడుతూ పీవోకే పాకిస్తాన్‌లో భాగం కాదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌కే పీవోకే అవసరం ఎక్కువ తప్ప ప్రజలకు పాకిస్తాన్ అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఆహారం, మందులు వంటి నిత్యావసర వస్తువులపై ఆంక్షలు కొనసాగితే ప్రజలు భారత్ వైపు చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అలా జరిగితే మొత్తం ప్రాంత రాజకీయ పరిస్థితులు మారిపోతాయని అన్నారు.

**• ఆర్థిక సంక్షోభంతో ప్రజల ఆవేదన**

పాలనా వైఫల్యాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బందులు ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురిచేశాయి. జూన్ 5 నుంచి ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో ప్రజలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయారు. ఆహారం, నిత్యావసర వస్తువుల సరఫరాపైనా ఆంక్షలు విధించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితులతో ప్రజల్లో ఆగ్రహం మరింత పెరిగింది. నిరసనల్లో పాల్గొన్న ప్రజలు పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌కు వ్యతిరేకంగా కూడా నినాదాలు చేశారు. నియంతృత్వ పాలనను సహించబోమని స్పష్టం చేశారు. పీవోకే ప్రజల అభిప్రాయాలను అణచివేసేందుకు బలప్రయోగం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

**• విదేశాల్లోనూ మద్దతు**

పీవోకే ఉద్యమానికి విదేశాల్లో నివసిస్తున్న ప్రవాసులు కూడా మద్దతు ప్రకటిస్తున్నారు. పలు దేశాల్లోని పాకిస్తాన్ రాయబార కార్యాలయాల ఎదుట నిరసనలు చేపడుతున్నారు. ముజఫరాబాద్‌తో పాటు మొత్తం పీవోకేలో ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ, ఆర్థిక హక్కులు లభించే వరకు ఉద్యమం కొనసాగుతుందని నాయకులు ప్రకటించారు. భారత్ సహాయం కోరుతున్న పీవోకే ప్రజల విజ్ఞప్తి ప్రస్తుతం అంతర్జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది.

## పాక్ వెళ్లాల్సిందే

• పీవోకే ఖాళీ చేస్తేనే కశ్మీర్ సమస్యకు ముగింపు
• తేల్చి చెప్పిన విదేశాంగ మంత్రి జైశంకర్

కశ్మీర్ సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం రావాలంటే పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి పాకిస్తాన్ తప్పుకోవాల్సిందేనని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. బ్రిటన్‌లోని ప్రముఖ థింక్ ట్యాంక్ చాథమ్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన గతంలో స్పష్టమైన అభిప్రాయం చెప్పారు. కశ్మీర్ సమస్యను ఎలా పరిష్కరిస్తారనే ప్రశ్నకు సమాధానంగా పీవోకేపై భారత్ వైఖరిని మరోసారి స్పష్టంగా వెల్లడించారు.

**మూడు కీలక అడుగులు పూర్తయ్యాయి**

2019లో ఆర్టికల్ 370 రద్దు చేయడం మొదటి అడుగని జైశంకర్ తెలిపారు. ఆ తర్వాత జమ్మూకశ్మీర్‌లో అభివృద్ధి, ఆర్థిక కార్యకలాపాల పునరుద్ధరణ, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇవ్వడం రెండో దశగా పేర్కొన్నారు. అధిక ఓటింగ్ శాతంతో ఎన్నికలు నిర్వహించడం మూడో అడుగని వివరించారు. ఇప్పుడు మిగిలి ఉన్నది అక్రమంగా పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న కశ్మీర్ భూభాగాన్ని తిరిగి సాధించడమేనని చెప్పారు.

**'దొంగిలించిన భూభాగం తిరిగి రావాలి'**

పాకిస్తాన్ అక్రమ ఆక్రమణలో ఉన్న పీవోకే భారత్‌లో కలిసిన రోజే కశ్మీర్ సమస్య పూర్తిగా ముగుస్తుందని జైశంకర్ స్పష్టం చేశారు. "అక్రమంగా ఆక్రమించిన కశ్మీర్ భూభాగం తిరిగి వస్తే కశ్మీర్ సమస్యకు ముగింపు పలుకుతాం" అని ఆయన అన్నారు. పీవోకే భారత్‌లో అంతర్భాగమేననే అధికారిక వైఖరిని మరోసారి పునరుద్ఘాటించారు. కశ్మీర్‌లో మానవ హక్కుల పరిస్థితిపై వచ్చిన ప్రశ్నలకు కూడా జైశంకర్ సమాధానం ఇచ్చారు. భారత్‌పై రాజకీయ ఉద్దేశాలతోనే కొన్ని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అవసరమైన చోట సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే భారత్ మానవ హక్కుల పరిరక్షణలో మెరుగైన స్థితిలో ఉందని పేర్కొన్నారు.

**• పీవోకేలో మార్పు కోసం ఎదురుచూపు**

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న పరిణామాలు అక్కడి ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి. స్థానిక ఉద్యమాలు, రాజకీయ డిమాండ్లు, ఆర్థిక సమస్యలు, భద్రతా పరిస్థితులపై వస్తున్న ఆరోపణలు ఈ ప్రాంతాన్ని మరోసారి అంతర్జాతీయ చర్చలోకి తీసుకొచ్చాయి. ప్రజలు మెరుగైన జీవన పరిస్థితులు, ప్రజాస్వామ్య హక్కులు, పారదర్శక పరిపాలన కోరుతున్నట్లు స్థానిక నాయకుల ప్రకటనలు సూచిస్తున్నాయి. మరోవైపు పీవోకే భారతదేశంలో అంతర్భాగమేనని భారత్ తన అధికారిక వైఖరిని నిరంతరం పునరుద్ఘాటిస్తోంది. ఈ నేపథ్యంలో పీవోకే భవిష్యత్‌పై రాజకీయ, దౌత్యపరమైన చర్చలు కొనసాగుతున్నాయి. పరిస్థితులు ఎలా మారినా అక్కడి ప్రజలకు శాంతి, భద్రత, అభివృద్ధి, మౌలిక హక్కులు లభించాలన్నదే అంతర్జాతీయ సమాజం ముందున్న ప్రధాన సవాలు. కశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా తీసుకునే ప్రతి అడుగు ప్రాంతీయ స్థిరత్వంతో పాటు కోట్లాది ప్రజల భవిష్యత్తుపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.



# దురాశతో దుఃఖం..
# కడతేరిన కుటుంబం

- ఆస్తి కోసం ఆరు ప్రాణాలు బలి
- మిగిలింది కన్నీరు.. జీవితాలు శూన్యం

దురాశ... నాలుగు ప్రాణాలను మింగేసింది! ఆస్తి కోసం మొదలైన కుట్ర... రైలు పట్టాలపై కుటుంబం ముగిసింది. ఒక హత్య... నాలుగు ఆత్మహత్యలు... చివరికి మిగిలింది కన్నీరు, శూన్యం మాత్రమే.. జీవితంలో సంపాదించేది ఆస్తి కావచ్చు... కానీ కోల్పోయేది మనుషులైతే ఆ సంపాదనకు విలువ ఏముంటుంది? ఒక్క క్షణం దురాశ మనసులో చోటు చేసుకుంటే... అది బంధాలను, మనసులను, చివరికి ప్రాణాలనే బలి తీసుకుంటుందని మరోసారి గుర్తు చేసిన విషాద గాథ ఇది.

### ఆస్తి ఆశ.. ఆరు ప్రాణాల బలి

ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వే స్టేషన్... మంగళవారం ఉదయం. సాధారణంగా రైళ్లు వచ్చి వెళ్లే ఆ ప్రదేశం ఒక్కసారిగా శోకసంద్రంగా మారింది. రైలు కింద పడి ఒక వ్యక్తి మాత్రమే కాదు... అతని భార్య, ఇద్దరు చిన్నారులు కూడా ప్రాణాలు కోల్పోయారు. చూసిన ప్రతి ఒక్కరి గుండె కలిచివేసిన దృశ్యం అది. మృతుడు కుడుముల హరికృష్ణ. అతడే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయాధికారి ఎన్. శ్రీహరి హత్య కేసులో ప్రధాన నిందితుడు. పోలీసులు గాలిస్తున్న సమయంలో కుటుంబంతో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ విషాదానికి మూలం జూన్ 15న జరిగిన సంఘటన. ఆ రోజు వ్యవసాయాధికారి శ్రీహరిని అతని బావమరిది హరికృష్ణ తన కారులో పెంచలకోనకు తీసుకెళ్లాడు. తిరుగు ప్రయాణంలో శ్రీహరి మరణించాడు. తొలుత గుండెపోటుతో చనిపోయినట్లు కథ అల్లారు. అంతా సహజ మరణమేనని నమ్మించే ప్రయత్నం చేశారు.

### హత్య దాచి.. కుటుంబం రైలు కింద


కానీ విధి మరో నిజాన్ని బయటపెట్టింది. శ్రీహరి మృతదేహంపై గాయాలను కుటుంబ సభ్యులు గుర్తించారు. అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయినా తొలి దశలో కేసు నమోదు కాలేదు. అనుమానితులను విచారించ లేదు. తన భర్త సహజంగా చనిపోలేదని, హత్యకు గురయ్యాడని శ్రీహరి భార్య లావణ్య ధైర్యంగా ఫిర్యాదు చేయడంతో కేసు మలుపు తిరిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక దర్యాప్తు ప్రారంభమైంది. విచారణలో ఒక్కో నిజం బయటపడింది. ఆస్తి కోసం పన్నిన కుట్రలో భాగంగా కుక్కలను చంపేందుకు ఉపయోగించే ఇంజెక్షన్ ఇచ్చి శ్రీహరిని హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ప్రధాన నిందితుడిగా హరికృష్ణ పేరు వెలుగులోకి వచ్చింది. కేసు సంచలనంగా మారింది. పోలీసుల నిర్లక్ష్యం బయటపడటంతో బుచ్చిరెడ్డిపాలెం ఏఎస్ఐని సస్పెండ్ చేశారు. 23 మంది పోలీసు సిబ్బందిని బదిలీ చేశారు. సీఐని కూడా వీటీఆర్‌కు పంపించారు. అయితే చట్టం ముందు నిలబడాల్సిన హరికృష్ణ... తన తప్పుకు సమాధానం చెప్పాల్సిన హరికృష్ణ... మరో దారిని ఎంచుకున్నాడు. భార్యను, ఇద్దరు అమాయక పిల్లలను వెంటబెట్టుకుని సింగరాయకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. క్షణాల్లో నలుగురి జీవితాలు రైలు పట్టాలపై ముగిశాయి.

### కుటుంబాన్నే బలితీసుకున్న దురాశ

ఈ విషాదంలో అత్యంత హృదయవిదారక విషయం ఏమిటంటే... నేరం చేసినా, చేయకపోయినా ఆ ఇద్దరు చిన్నారులకు ఎలాంటి తప్పు లేదు. జీవితమంటే ఏమిటో కూడా తెలియని వయసులో వారు మరణాన్ని చూడాల్సి వచ్చింది. ఒకరి దురాశ... ఒకరి నిర్ణయం... నాలుగు ప్రాణాలను బలి తీసుకుంది. ఈ ఘటన ఒక కుటుంబ కథ మాత్రమే కాదు... సమాజానికి గట్టి హెచ్చరిక. ఆస్తి కోసం బంధాలను చంపేవాడు... చివరికి తన కుటుంబాన్నే కోల్పోతాడు. దురాశతో సంపాదించినదేమీ శాశ్వతం కాదు. కానీ దురాశ వల్ల కోల్పోయిన మనుషులు మాత్రం తిరిగి రావు. "దురాశ దుఃఖానికి చేటు" అనే సామెతను ఈ ఘటన మరింత భయానకంగా నిజం చేసింది. ఆస్తి కోసం మొదలైన కుట్ర... ఒక హత్యతో ఆగలేదు. చివరకు మరో నాలుగు ప్రాణాలను కూడా బలి తీసుకుంది. ఇప్పుడు రెండు కుటుంబాల్లోనూ మిగిలింది అంతులేని శోకం... పిల్లల నవ్వులు వినిపించని ఇళ్లు... భర్త కోసం ఎదురు చూసే భార్య కన్నీళ్లు... తల్లిదండ్రులను కోల్పోయిన బంధువుల రోదనలు మాత్రమే. ఒక్క క్షణం దురాశ... ఐదు ప్రాణాలను బలి తీసుకుంది. అందుకే పెద్దలు చెప్పిన మాట ఇప్పటికీ సజీవ సత్యమే... "ఆస్తి మనిషి కోసం ఉండాలి... మనిషి ఆస్తి కోసం కాదు."

# పాలనలో వేగం పెంచండి

- టెక్నాలజీని అందిపుచ్చుకోండి
- బిజినెస్ రూల్స్‌కు భారీ మార్పులు
- నిబంధనల సంస్కరణలకు సీఎం శ్రీకారం



ప్రభుత్వ పాలన మరింత వేగంగా సాగాలంటే పాత బిజినెస్ రూల్స్‌లో సమూల మార్పులు అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. టెక్నాలజీ వినియోగంతో అవసరం లేని నిబంధనలను తొలగించి, కొత్త అవసరాలకు అనుగుణంగా రీడ్రాఫ్ట్ చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా నిర్ణయాలు వేగంగా అమలు కావాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేలా పాలనా వ్యవస్థలో వెసులుబాటు ఉండాలని పేర్కొన్నారు.

### ఆర్టీజీఎస్ సమీక్షలో కీలక ఆదేశాలు

సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును సీఎం సమీక్షించారు. దేవాదాయ శాఖ, రహదారులుభవనాలు శాఖ, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా శాఖ, అగ్నిమాపక శాఖ, వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలు వ్యక్తం చేస్తున్న సంతృప్తి స్థాయిని విశ్లేషిస్తూ మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ లక్ష్యంగా ప్రతి శాఖ పనిచేయాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు సమర్థ నాయకత్వం చూపితేనే ప్రభుత్వ ఫలితాలు చివరి వ్యక్తికి చేరుతాయని తెలిపారు.

### ఫిర్యాదుల పరిష్కారంలో కొత్త విధానం

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును మరింత సమర్థంగా పరిష్కరించేందుకు క్రౌడ్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేయాలని సీఎం ఆదేశించారు. సమస్యలపై విస్తృత సమాచారం సేకరించి వేగంగా స్పందించే విధానం ఉండాలని చెప్పారు. ప్రతి అర్జీదారుడికి తప్పనిసరిగా సమాధానం అందేలా వ్యవస్థ పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలను పాలనలో భాగం చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

### దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో అపార అభివృద్ధి అవకాశాలు ఉన్నాయని చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రసాదాల నాణ్యత పెంపుతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం కావాలని సూచించారు. ఈ దేవాలయాలను గ్రోత్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తే స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని చెప్పారు. ఆలయాల చుట్టూ వ్యాపార కార్యకలాపాలు, పర్యాటక రంగం విస్తరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

### వ్యవసాయం, అగ్నిమాపక సేవలపై దృష్టి

అగ్నిమాపక శాఖ సేవల ప్రమాణాలను మరింత పెంచాలని సీఎం స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్‌బీకేల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా అమలు కావాలని పేర్కొన్నారు. 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదైందని గుర్తుచేస్తూ, అదే వేగాన్ని కొనసాగించాలంటే పాలనలో సంస్కరణలు కీలకమని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

## క్షేత్రస్థాయిలోకి వెళ్లండి

(మొదటి పేజీ తరువాయి.)

గత పాలనలో రాజకీయ కక్షతో కొంత భూమిని 22ఏ జాబితాలో చేర్చి వివాదాల్లోకి నెట్టారని చంద్రబాబు విమర్శించారు. ఇప్పటివరకు 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, మరో 72 లక్షల మందికి ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి, వట్టిచెరుకూరు భూ సమస్యలను పరిష్కరించామని చెప్పారు. శెట్టిపల్లి వివాదం పరిష్కారంతో రైతులకు న్యాయం జరగడంతో పాటు ప్రభుత్వానికి సుమారు 90 ఎకరాల విలువైన భూమి లభించిందని వివరించారు. ఇలాంటి ఆస్తులను అన్‌లాక్ చేసి రాష్ట్ర అభివృద్ధికి వినియోగించాలని అధికారులకు సూచించారు.

### ఫిర్యాదుల విశ్లేషణకు కొత్త విధానం

గ్రీవెన్స్ పరిష్కారం ఆధారంగా ఫిర్యాదుల సంఖ్య తగ్గుతోందా, పెరుగుతోందా అనే అంశాన్ని నిరంతరం విశ్లేషించాలని సీఎం ఆదేశించారు. సమస్యలు శాశ్వతంగా పరిష్కారమైతే ఫిర్యాదులు సహజంగానే తగ్గుతాయని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో జీరో పెండింగ్ లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను విభాగాల వారీగా గుర్తించి వేగంగా పరిష్కరించే విధానం అమలు చేయాలని సూచించారు.

### వృద్ధి లక్ష్యాలపై దృష్టి

రాష్ట్రం 15 శాతం వృద్ధిరేటు సాధించే సామర్థ్యం కలిగి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి నెల కేపీఐ సూచికల ఆధారంగా ఆర్థిక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ప్రత్యక్షంగా ప్రజలను కలిస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించాలని, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఆర్టీజీఎస్ రూపొందించిన "గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్" మాసపత్రికను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

# వైజాగ్‌లో జగన్ వైలెంట్

- మత్స్యకారులపై మమకారం చూపాలి
- ప్రభుత్వం కోటి పరిహారం చెల్లించాలి
- బాధితులకు పరామర్శ.. బాబు సర్కార్‌పై విమర్శ

విశాఖపట్నం తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. వన్‌టౌన్ ప్రాంతంలో బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక వ్యక్తి చిన్నాను కలిసి జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఆవేదనను విని వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి ఏడు లక్షల రూపాయలు... జగన్ సాయంగా ప్రకటించారు.



### రూ. కోటి పరిహారం ఇవ్వాలి

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారం సరిపోదని జగన్ అన్నారు. ప్రతి కుటుంబానికి రూ.1 కోటి చొప్పున ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కోల్పోయిన కుటుంబాలు తిరిగి నిలదొక్కుకునేందుకు కొత్త చేపల పడవలను కూడా ప్రభుత్వం అందించాలని కోరారు. మత్స్యకారుల జీవితం సముద్రంపై ఆధారపడినందున వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

### ప్రభుత్వంపై విమర్శలు

ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించి ఉంటే ప్రాణనష్టం తప్పేదని జగన్ ఆరోపించారు. విపత్తు నిర్వహణ శాఖ మంత్రి, మత్స్యశాఖ మంత్రి బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించకుండా వీడియో కాల్‌లతో సరిపెట్టారని విమర్శించారు. ప్రమాదానికి సంబంధించిన వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ, విచారణ కోసం ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల కమిటీ నివేదికపై కూడా అనుమానం వ్యక్తం చేశారు.

### నాడు మత్స్యకారులకు అండగా..

తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చామని జగన్ గుర్తు చేశారు. 2019కు ముందు ప్రమాదాల్లో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం మాత్రమే ఉండేదని, అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. 2023లో విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో దెబ్బతిన్న 49 పడవలకు సుమారు 80 శాతం మేర పరిహారం అందించామని వివరించారు. చేపల వేటపై ఆధారపడిన సుమారు 400 మందికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామని తెలిపారు.

### మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులను కేంద్రంతో సమన్వయం చేసి స్వదేశానికి తీసుకొచ్చిన విషయాన్ని జగన్ ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణాన్ని తమ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. ఆ ప్రాజెక్టులు పూర్తయి ఉంటే వేలాది మందికి ఉపాధి లభించేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే తొలి నెలలోనే బాధిత కుటుంబాలకు పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల జీవిత భద్రత, జీవనోపాధి ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యంగా ఉండాలని జగన్ స్పష్టం చేశారు.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు..
# 19 ఏళ్ల తర్వాత

- మళ్లీ కోల్‌కతాకు తస్లీమా నస్రీన్ రాక



బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ దాదాపు 19 ఏళ్ల తర్వాత కోల్‌కతా నగరానికి రానున్నారు. ఆగస్టు 1న రవీంద్ర సదన్‌లో జరిగే మతోన్మాద వ్యతిరేక సాహిత్య సభలో ఆమె పాల్గొననున్నారు. ఈ విషయాన్ని తస్లీమా నస్రీన్ స్వయంగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటించారు. కార్యక్రమంలో కవితలు చదివే అవకాశం కూడా ఉంది. ఈ పర్యటనకు సాహిత్యపరంగానే కాకుండా రాజకీయ ప్రాధాన్యమూ ఏర్పడింది.

### 2007లో నగరం వీడిన తస్లీమా

2007 నవంబర్ 21న తస్లీమా నస్రీన్ కోల్‌కతా విడిచి వెళ్లాల్సి వచ్చింది. ఆమె రచనలపై కొన్ని మత సంస్థలు తీవ్ర నిరసనలు చేపట్టాయి. నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అప్పటి వామపక్ష ప్రభుత్వం ఆమెను కోల్‌కతా నుంచి పంపించింది. మొదట జైపూర్‌కు తరలించారు. తర్వాత ఢిల్లీలో నివాసం కల్పించారు. ఆ సంఘటన పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో అత్యంత వివాదాస్పద అంశంగా నిలిచింది.

### బీజేపీ రాజకీయ సందేశం

లౌకికవాద సంస్థలు, మతోన్మాద వ్యతిరేక సంఘాలు కలిసి ఈ సభను నిర్వహిస్తున్నాయి. తస్లీమా తిరిగి కోల్‌కతా రావడాన్ని స్వాగతిస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సువేందు అధికారి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని వారు వెల్లడించారు. చాలా కాలం తర్వాత ఆమె నగరంలో అడుగుపెట్టడం ప్రత్యేక సందర్భంగా భావిస్తున్నారు. తస్లీమా నస్రీన్ రాకను బీజేపీ రాజకీయంగా కీలక పరిణామంగా చూస్తోంది. గత ప్రభుత్వాలు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడలేకపోయాయని పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. మత ఛాందసవాదానికి తలొగ్గిన ప్రభుత్వాల వల్లే తస్లీమా నగరం విడిచి వెళ్లాల్సి వచ్చిందని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులు మారాయని బీజేపీ చెబుతోంది.

### 'లజ్జ'తో ప్రపంచ గుర్తింపు

1990వ దశకంలో తస్లీమా నస్రీన్ రచనలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా 'లజ్జ' నవల ఆమెకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చింది. మత ఛాందసవాదంపై ఆమె చేసిన విమర్శల కారణంగా బంగ్లాదేశ్‌లో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆమెపై ఫత్వాలు కూడా జారీ అయ్యాయి. ప్రాణహాని హెచ్చరికల నేపథ్యంలో 1994లో బంగ్లాదేశ్‌ను విడిచి వెళ్లాల్సి వచ్చింది. తర్వాత యూరప్, అమెరికాలో నివసించిన ఆమె 2004లో భారత్‌కు వచ్చి కోల్‌కతాలో స్థిరపడ్డారు. తస్లీమా నస్రీన్ పర్యటనతో భావ ప్రకటనా స్వేచ్ఛ, లౌకికవాదం, మత సహనం అంశాలపై మరోసారి చర్చ మొదలైంది. రచయితల స్వేచ్ఛను కాపాడాలా? ప్రజా శాంతికి ప్రాధాన్యం ఇవ్వాలా? అనే ప్రశ్నలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆగస్టు 1న జరిగే ఈ కార్యక్రమం సాధారణ సాహిత్య సభగానే ముగుస్తుందా? లేక పెద్ద రాజకీయ సందేశంగా మారుతుందా? అనే అంశంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# ఎంటరైతే ఎలిమినేషన్ షురూ

- బరితెగించిన బంగ్లా సర్కారు
- హసీనాకు హై అలర్ట్ వార్నింగ్



మాజీ ప్రధాని షేక్ హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తే వెంటనే జైలుకు పంపిస్తామని ఆ దేశ ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ సహాయ మంత్రి షామా ఒబైద్ ఇస్లాం ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హసీనా స్వచ్ఛందంగా లొంగిపోయినా చట్ట ప్రక్రియలో భాగంగా ముందుగా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### డిసెంబర్‌లో తిరుగు ప్రయాణం?


షేక్ హసీనా ఈ ఏడాది డిసెంబర్‌లో ఢాకాకు తిరిగి రావడానికి సిద్ధమవుతున్నట్లు ఇటీవల వార్తలు వెలువడ్డాయి. ఈ నిర్ణయం పూర్తిగా ఆమె వ్యక్తిగత నిర్ణయమని సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ వార్తల నేపథ్యంలో ప్రభుత్వం తన వైఖరిని మరింత స్పష్టంగా వెల్లడించింది. భారత్‌లో ఉన్నా, బంగ్లాదేశ్‌కు వచ్చినా చట్టం అందరికీ ఒకటేనని మంత్రి పేర్కొన్నారు.

### మరణశిక్ష విధించిన ప్రత్యేక న్యాయస్థానం

2024 ఆగస్టు 5న విద్యార్థుల నేతృత్వంలో జరిగిన భారీ నిరసనల తర్వాత షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయింది. దేశవ్యాప్తంగా హింసాత్మక పరిస్థితులు నెలకొనడంతో ఆమె ఢాకా విడిచి భారత్‌కు వచ్చారు. అప్పటి నుంచి భారత్‌లోనే నివసిస్తున్నారు. అప్పటి రాజకీయ పరిణామాలు బంగ్లాదేశ్ చరిత్రలో కీలక మలుపుగా నిలిచాయి. గత ఏడాది నవంబర్‌లో ఢాకాలోని ప్రత్యేక ట్రైబ్యునల్ షేక్ హసీనాకు గైర్హాజరులోనే మరణశిక్ష విధించింది. 2024 విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసే క్రమంలో మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ తీర్పు వెలువడింది. అయితే ఈ కేసులు, తీర్పులు రాజకీయ ప్రేరేపితమైనవేనని హసీనా ఇప్పటికే ఖండించారు.

### భారత్‌ను కోరుతున్న ఢాకా

తీర్పు వెలువడిన తర్వాత షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్‌ను కోరుతోంది. ఆమెను తిరిగి తీసుకురావడానికి అవసరమైన ప్రక్రియ గత తాత్కాలిక ప్రభుత్వం హయాంలోనే ప్రారంభమైందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి తెలిపారు. ప్రస్తుతం బీఎన్‌పీ నేతృత్వంలోని ప్రభుత్వం అదే ప్రక్రియను కొనసాగిస్తోందని చెప్పారు. హసీనా విదేశాల నుంచి చేస్తున్న వ్యాఖ్యలు అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నంగానే కనిపిస్తున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న పార్టీ నాయకులకు ఆమె సంకేతాలు ఇస్తున్నారని ఆరోపించారు. హసీనా తిరిగి వచ్చిన తర్వాత తదుపరి చర్యలు పూర్తిగా చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో బంగ్లాదేశ్ రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- ఆణివార ఆస్థానానికి ముందు తిరుమల శుద్ధి

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 17న జరిగే సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రతి ఏడాది ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి వంటి ప్రధాన ఉత్సవాలకు ముందు ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం తిరుమలలో చిరకాల ఆనవాయితీగా కొనసాగుతోంది.

### సుగంధ ద్రవ్యాలతో ఆలయ పవిత్రీకరణ

ఈ సందర్భంగా ఆనందనిలయం నుంచి బంగారు వాకిలి వరకు ఆలయం మొత్తం పరిశుభ్రం చేశారు. ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రిని నీటితో శుభ్రపరిచారు. శ్రీవారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతా ప్రోక్షించారు. ఈ ప్రక్రియతో ఆలయం ఆధ్యాత్మిక సుగంధంతో నిండిపోయింది.

### ప్రత్యేక పూజలు.. దర్శనాల పునఃప్రారంభం

శుద్ధి కార్యక్రమం పూర్తయిన తర్వాత శ్రీవారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు, నైవేద్య కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అన్ని కైంకర్యాలు ముగిసిన తర్వాత భక్తులకు శ్రీవారి దర్శనాన్ని పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా జరగాల్సిన అష్టదళ పాదపద్మారాధన సేవను తిరుమల తిరుపతి దేవస్థానం రద్దు చేసింది. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆలయ సంప్రదాయాల్లో అత్యంత విశిష్టమైన కార్యక్రమమని తెలిపారు.

# 2027 వరల్డ్‌కప్ ప్లాన్

• రోహిత్, కోహ్లీకి రొటేషన్! • సీనియర్లకు విశ్రాంతి ఆలోచన
• బెంచ్ బలం పెంచే వ్యూహం




2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని భారత జట్టు యాజమాన్యం కొత్త రొటేషన్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లకు కొన్ని మ్యాచ్‌లలో విశ్రాంతి ఇచ్చి యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో బెంచ్ బలం పెరగడంతో పాటు ప్రత్యామ్నాయ ఆటగాళ్లు కూడా కీలక మ్యాచ్‌లకు సిద్ధంగా ఉంటారని మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

### సీనియర్లను ఒప్పించడమే సవాల్

అయితే ప్రస్తుతం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రధానంగా వన్డేల్లో మాత్రమే ఆడుతున్నందున వారికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ కూడా అవసరం. అలాంటి పరిస్థితిలో వారిని రొటేషన్ విధానానికి ఒప్పించడం జట్టు యాజమాన్యానికి పెద్ద సవాల్‌గా మారింది. ఇటీవల యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో రోహిత్‌కు విశ్రాంతి ఇవ్వాలని కూడా ఆలోచించినట్లు వార్తలు వచ్చాయి. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ అనంతరం భారత జట్టు వరల్డ్‌కప్ ప్రణాళికపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# అక్షర్ ఆల్‌రౌండ్ షో

## భారత్‌కు శుభారంభం

### ఇంగ్లండ్‌పై ఇండియా ఘన విజయం!

మూడు వన్డేల సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. బర్మింగ్‌హామ్‌లో జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బ్యాట్, బంతితో అద్భుత ప్రదర్శన చేసిన అక్షర్ పటేల్ మ్యాచ్ హీరోగా నిలిచాడు. టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసి 258 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 107/6తో కష్టాల్లో పడిన ఇంగ్లండ్‌ను జో రూట్ (76 నాటౌట్), లియామ్ డాసన్ (68) 121 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. అయినప్పటికీ అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నాడు. 259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 160/4 వద్ద ఒత్తిడిలో పడింది. ఈ సమయంలో అక్షర్ పటేల్ (57 నాటౌట్), వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) ఐదో వికెట్‌కు అజేయంగా 102 పరుగులు జోడించి జట్టును విజయతీరాలకు చేర్చారు. శుభ్‌మన్ గిల్ 80 పరుగులతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో భారత్ సిరీస్‌లో 10 ఆధిక్యం సాధించింది.




# కోహ్లీ మరో ఘనత

◆ దిగ్గజాల సరసన చోటు!
◆ 300 వన్డే ఇన్నింగ్స్ మైలురాయి
◆ చరిత్రలో ఐదో భారత బ్యాటర్

ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే క్రికెట్‌లో 300 ఇన్నింగ్స్ ఆడిన ఐదో భారత క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత సాధించిన భారత ఆటగాళ్ల జాబితాలో ఇప్పటికే సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రావిడ్, మహ్మద్ అజహరుద్దీన్, సౌరవ్ గంగూలీ ఉన్నారు. ప్రస్తుతం కోహ్లీ 312 వన్డేలు ఆడి 14,797 పరుగులు చేశాడు. అతని సగటు 58.71 కాగా, స్ట్రైక్‌రేట్ 93.82గా ఉంది. ప్రపంచ వన్డే క్రికెట్‌లో




అత్యధిక ఇన్నింగ్స్ ఆడిన ఆటగాడిగా సచిన్ టెండూల్కర్ 452 ఇన్నింగ్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

# ఇంగ్లండ్‌లో కొత్త చరిత్ర

• వన్డే సిరీస్‌లో రికార్డు వేట
• ద్రావిడ్ రికార్డుపై కోహ్లీ, రోహిత్ గురి!

ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అరుదైన రికార్డుపై కన్నేశారు. ఇంగ్లండ్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా ప్రస్తుతం రాహుల్ ద్రావిడ్ 648 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ 581 పరుగులతో నాలుగో స్థానంలో ఉండగా, ఈ సిరీస్‌లో మంచి ప్రదర్శన చేస్తే ద్రావిడ్ రికార్డును అధిగమించే అవకాశం ఉంది. సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ కూడా ఈ జాబితాలో ముందున్నారు.

### రోహిత్‌కూ భారీ అవకాశం

రోహిత్ శర్మ ప్రస్తుతం 410 పరుగులతో ఏడో




స్థానంలో ఉన్నాడు. అయితే ఈ జాబితాలో ఉన్న ఆటగాళ్లందరిలో అతడికే అత్యుత్తమ సగటు (58.57) ఉంది. వరుసగా భారీ ఇన్నింగ్స్ ఆడితే రోహిత్ కూడా అగ్రస్థానానికి చేరువయ్యే అవకాశం ఉంది. టీ20 సిరీస్ ఓటమి తర్వాత భారత జట్టు వన్డేల్లో పుంజుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో కోహ్లీ, రోహిత్ వ్యక్తిగత రికార్డులు కూడా ఈ సిరీస్‌ను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి. అభిమానుల దృష్టి ఇప్పుడు వారి బ్యాట్ నుంచి వచ్చే పరుగులపైనే నిలిచింది.




# తండ్రి విజయ్ కోసం సంజయ్ త్యాగం


• జననాయగన్ కోసం సిగ్మా మూవీ వాయిదా

విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ 'సిగ్మా'తో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విజయ్ సినిమా కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జన నాయగన్' జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏడు నెలల నిరీక్షణ అనంతరం వస్తోన్న ఈ సినిమా కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. దీనికి లైన్ క్లియర్ చేయడం కోసం సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకుంటున్నారని సమాచారం. సందీప్ కిషన్ కథానాయకుడిగా రూపొందిన 'సిగ్మా' చిత్రాన్ని జులై 31న విడుదల చేయాలని మొదట భావించారు. 'జన నాయగన్' జులై చివరి వారంలో వస్తుండటంతో.. ఈ సినిమా విడుదలను ఆగస్టుకు వాయిదా వేసినట్లు సమాచారం. గతంలో సంజయ్ ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. ఇది తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని చెప్పారు. ఆగస్టులో పెద్ద సినిమాలేవీ లేకపోవడంతో అప్పుడు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక అప్‌డేట్ రావాల్సి ఉంది. ఇక విజయ్ కుమారుడు సంజయ్‌కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం దర్శకుడిగానే కాకుండా త్వరలోనే నటుడిగా కూడా వెండితెరకు పరిచయం కానున్నట్లు సమాచారం. ప్రముఖ నిర్మాత జీకేఎమ్ తమిళ్ కుమారన్ తన సొంత బ్యానర్‌పై సంజయ్‌ను హీరోగా పరిచయం చేయనున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. విజయ్ సినిమాల నుంచి వైదొలగిన నేపథ్యంలో ఆయన కుమారుడు వెండితెరకు పరిచయం కానున్నట్లు వార్తలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# తుంబాడ్ 2 లో ఆలియా భట్

భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా






సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# అందరూ చూడాల్సిన మూవీ

ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బడ్జెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.








# తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

సోషల్ మీడియా ప్రచారాలను తిప్పికొట్టిన టీమ్

అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.





This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from **H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072.** Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085